




Truth of News

# సూర్య వాస్తవం

RNI NO : APTEL/25/A0239

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్



IRS PUBLICATIONS
irspublications12@gmail.com



సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 81 | మంగళవారం 19 ఆగస్టు 2025 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi


# దేశంలో ఓట్ల దొంగలు

- తెలంగాణలోనూ ఓట్ల చోరీకి కుట్రలు
- కలిసికట్టుగా వారి భరతం పట్టాలి
- బహుజనుల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం
- బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటున్నది కిషన్‌రెడ్డి, మోడీనే..
- మత ప్రాతిపదికన రిజర్వేషన్లు రాజ్యాంగంలోనే లేవు
- కేసీఆర్ చేసిన చట్టం బీసీలకు శాపం :
- సర్దార్ సర్వాయి పాపన్న జయంతి సభలో సీఎం రేవంత్‌రెడ్డి
- ట్యాంక్‌బండ్‌పై విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన

హైదరాబాద్– సూర్య వాస్తవం, ఆగస్టు 18

దేశంలో ఓట్ల దొంగలు పడ్డారని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి అన్నారు. బీజేపీ నేతలు దొంగ ఓట్లతో కుట్రలు కుతంత్రాలు చేస్తున్నారనీ, తెలంగాణలో కూడా ఈ తరహా కుట్రలకు తెరలేపారని చెప్పారు. మహారాష్ట్రలో ఎన్నికల కమిషన్ నాలుగు నెలల్లో కోటి ఓట్లను నమోదు చేసిందని గుర్తు చేశారు. ఈ రకంగా అంబేద్కర్ పుట్టిన గడ్డ మీద రాజ్యాంగాన్ని అపహాస్యం చేశారని విమర్శించారు.

దొంగ ఓట్లతోనే మహారాష్ట్రలో బీజేపీ అధికారంలోకి వచ్చిందన్నారు. ఓట్ల చోరీ దేశం నలుమూలలా జరుగుతోందనీ, బీహార్‌లో 65 లక్షల ఓట్లు తొలగించారని గుర్తు చేశారు. బతికున్న వారిని చనిపోయినట్టుగా చూపారని తెలిపారు. ఈ కుట్రను రాహుల్ గాంధీ బయటపెట్టారని చెప్పారు. తప్పు చేసిన వారిని వదిలేసి తప్పును ప్రశ్నించిన రాహుల్ గాంధీని



ఎన్నికల కమిషన్ అఫిడవిట్ అడగటమేంటని ప్రశ్నించారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 375వ జయంతి సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహ ఏర్పాటుకు సీఎం శంకుస్థాపన చేశారు. అనంతరం రవీంద్రభారతిలో బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన సభలో




## నరేంద్ర మోదీతో శుభాంశు శుక్లా భేటీ...

- ప్రధానికి వ్యోమగామి అపురూప కానుక
- అంతరిక్షంలోకి తీసుకెళ్లిన జాతీయ జెండాను ప్రధానికి బహూకరణ
- తన యాత్ర అనుభవాలను, ప్రయోగాల వివరాలను పంచుకున్న శుక్లా
- వ్యోమగామిని అభినందించిన ప్రధాని మోదీ
- పార్లమెంటులోనూ శుభాన్షు శుక్లాపై ప్రశంసల వర్షం

న్యూఢిల్లీ – సూర్య వాస్తవం, ఆగస్టు 18

అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో భారత కీర్తి పతాకాన్ని ఎగురవేసిన భారత వ్యోమగామి, వాయుసేన టెస్ట్ పైలట్ గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లా సోమవారం

- మిగతా 2లో..



రాజధాని అమరావతి మునిగిపోయినట్లు..

## వైసీపీ దుష్ప్రచారం చేస్తుంది

- మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు


విజయవాడ – సూర్య వాస్తవం, ఆగస్టు 18

రాజధాని అమరావతి మునిగిపోయిందంటూ వైసీపీ నాయకులు, వారి అనుకూల మీడియా చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు తీవ్రంగా ఖండించారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, “అమరావతిలో 52 వేల కోట్లతో జరుగుతున్న నిర్మాణాలను చూసి ఓర్వలేక వైసీపీ నేతలు బ్లూ మీడియా సహకారంతో విషప్రచారం చేస్తున్నారు. ఎక్కడో వాగులు పొంగిన దృశ్యాలను తీసుకువచ్చి అమరావతి మునిగిపోయిందంటూ ఫేక్ న్యూస్ ప్రచారం చేస్తున్నారు” అని మండిపడ్డారు. ప్రకాశం బ్యారేజ్ గేట్లు పనిచేయడంలేదని, కొండవీటి వాగు నీటితో పంటలు మునిగిపోయాయని వైసీపీ నేతలు తప్పుడు ప్రచారం

- మిగతా 2లో..

## వైసీపీ విష ప్రచారాన్ని తిప్పికొట్టండి

- వైసీపీ తప్పుడు ప్రచారాలపై సీఎం చంద్రబాబు తీవ్రస్థాయిలో విమర్శలు
- ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడమే ప్రతిపక్షం పని
- ‘సుపరిపాలనలో తొలి అడుగు’ విజయవంతమైందన్న సీఎం
- కోటి 24 లక్షల కుటుంబాలను నేరుగా కలిశామని వెల్లడి
- పార్టీ కోసం పనిచేసిన వారికి నామినేటెడ్ పదవులు ఇస్తామని హామీ
- నేతలు, కార్యకర్తలు మరింత బాధ్యతగా, క్రమశిక్షణతో మెలగాలని సూచన



అమరావతి – సూర్య వాస్తవం, ఆగస్టు 18

రాష్ట్రంలో వైసీపీ నిత్యం విషం చిమ్ముతూ, తప్పుడు ప్రచారాలతో ప్రజలను గందరగోళపరిచే కుట్ర చేస్తోందని ముఖ్యమంత్రి చంద్ర బాబు తీవ్రంగా విమర్శించారు. రాజధాని మునిగి పోయిందని, ప్రాజెక్టులు కొట్టుకుపోతున్నాయని అసత్యాలు ప్రచారం చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడమే వారి సిద్ధాంతమని ఆరోపించారు. సోమవారం నాడు పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీలు, ఇతర ముఖ్య నేతలతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. వైసీపీ చేస్తున్న అసత్య ప్రచారాలను ఎప్పటికప్పుడు సమర్థంగా తిప్పికొట్టాలని, ఈ విషయంలో మంత్రులు, పార్టీ నేతలు మరింత చొరవ చూపాలని ఆయన దిశానిర్దేశం చేశారు.

“రాష్ట్రంలో ఒక నేర చరిత్ర కలిగిన పార్టీ ఉంది. వాళ్ల పని నిత్యం విషం చిమ్మడం, తప్పుడు ప్రచారం చేయడమే వారి పని. సోషల్ మీడియా, సొంత టీవీ, పత్రికల్లో, అనుబంధ మీడియాతో అసత్యాలు ప్రచారం చేస్తున్నారు. రాజధాని కోసం పొన్నూరును ముంచారని ఒకసారి, కొండవీటి వాగు ఎత్తిపోతల పంపులు పని చేయడంలేదని మరోసారి... ప్రకాశం బ్యారేజ్ ప్రమాదంలో పడిందని ఇంకోసారి వార్తలు వేశారు. తప్పుడు ప్రచారంతో ప్రజలను గందరగోళ పరచాలి అనే సిద్ధాంతంతోనే వైసీపీ రోజూ పనిచేస్తోంది. వైసీపీ చేస్తున్న

- మిగతా 2లో..



## రాష్ట్రంలో కొత్త మద్యం పాలసీ ప్రారంభం

- 1 సెప్టెంబర్, 2025 నుంచి 31 ఆగస్టు, 2028 వరకు అమలు
- కొత్త వారిని ప్రోత్సహించేలా పాదర్శకంగా కొత్త బార్ పాలసీ
- నిషాంత్ కుమార్, ఎక్సైజ్ శాఖ డైరెక్టర్

విజయవాడ – సూర్య వాస్తవం, ఆగస్టు 18

మూడేళ్ల కాలపరిమితో రాష్ట్రంలో నూతన బార్ పాలసీని అమలు చేయనున్నట్లు ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ నిషాంత్ కుమార్ తెలిపారు.. సోమవారం గుంటూరు జిల్లా మంగళగిరి ఐహెచ్ సీ భవన్ లో గల ఎక్సైజ్ శాఖ కమిషనర్ కార్యాలయంలో

2లో

## ఏపీకి కేంద్రం అండగా నిలవాలి

- కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో ఢిల్లీలో భేటీ అయిన మంత్రి నారా లోకేశ్
- ఏపీకి సెమీకండక్టర్ యూనిట్ మంజూరుపై కేంద్రానికి కృతజ్ఞతలు
- క్వాంటమ్ వ్యాలీ, రతన్ టాటా హబ్‌కు రూ. 1300 కోట్ల సాయం కోరిన లోకేశ్
- ఏఐ వర్సిటీ, డీప్ టెక్ అకాడమీ ఏర్పాటుకు సహకరించాలని వినతి
- విశాఖలో సబ్ మెరైన్ కేబుల్ పనులు వేగవంతం చేయాలని అభ్యర్థన
- ఏపీలో సంస్కరణల అమలుకు కేంద్రమంత్రి సానుకూల స్పందన



అమరావతి – సూర్య వాస్తవం, ఆగస్టు 18

ఆంధ్రప్రదేశ్‌ను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ, ఆవిష్కరణల రంగంలో దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఈ ప్రణాళికలో భాగంగా రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సోమవారం న్యూఢిల్లీలో కేంద్ర రైల్వే, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశమయ్యారు. రాష్ట్రానికి

- మిగతా 2లో..

## భారత రాష్ట్రపతిని కలిసిన అనంతపురం జిల్లా యువకుడు



న్యూఢిల్లీ – సూర్య వాస్తవం, ఆగస్టు 18

జిల్లాకు చెందిన జాతీయ యువజన అవార్డు గ్రహీత మరియు యువ నాయకుడు బిసాతి భరత్ , ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ లో భారతదేశ రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము గారిని కలుసుకుని “వన్ నేషన్ వన్ ఎలెక్షన్” భావనపై చర్చించారు. ఈ అంశంపై ప్రచారం చేయడానికి భారతదేశ యువ ప్రతిభావంతులచే ఏర్పాటు చేయబడిన “సంవిధాన్ సపోర్ట్ గ్రూప్” లో కీలక సభ్యుడిగా బిసాతి భరత్ ఉన్నారు.బిసాటి భరత్ తో పాటు జాతీయ యువజన మరియు ఎన్ ఎస్ ఎస్ అవార్డు గ్రహీతలైన శివకుమార్, మధీష్ పారీఖ్, సిమర్దీప్ సియాల్, రోహిత్, పల్లబ్ బిశ్వాస్, నిహారిక, శ్రుస్తి మరియు మంటూ కుమార్‌లు రాష్ట్రపతిని కలిసి,

- మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

# నరేంద్ర మోదీతో శుభాంశు శుక్లా భేటీ...

(మొదటి పేజీ తరువాయి)

ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో భేటీ అయ్యారు. దేశ రాజధానిలోని ప్రధాని అధికారిక నివాసంలో జరిగిన ఈ సమావేశంలో, శుక్లా ఒక అపురూపమైన కానుకను మోదీకి అందజేశారు. తన చారిత్రాత్మక 'యాక్స్-4' మిషన్‌లో భాగంగా అంతరిక్షంలోకి తీసుకెళ్లిన త్రివర్ణ పతాకాన్ని ఆయన ప్రధానికి బహూకరించారు. మానవసహిత అంతరిక్ష యాత్రలో భారత్ సాధిస్తున్న ప్రగతికి ఈ ఘటన ప్రతీకగా నిలిచింది.

ఈ సందర్భంగా శుభాంశు శుక్లా తన అంతరిక్ష యాత్రలోని ఉత్కంఠభరిత క్షణాలను, ఎదురైన సవాళ్లను ప్రధానికి వివరించారు. అంతర్జాతీయ వ్యోమగాములతో కలిసి సుదీర్ఘకాలం అంతరిక్ష కేంద్రంలో గడిపిన అనుభవాలను పంచుకున్నారు.

అక్కడ గురుత్వాకర్షణ లేని స్థితిలో మానవ శరీరంపై కలిగే మార్పులు, స్పేస్‌లో వ్యవసాయానికి సంబంధించిన టెక్నాలజీ వంటి కీలకమైన శాస్త్రీయ ప్రయోగాల వివరాలను తెలియజేశారు. ఈ ప్రయోగాలు భవిష్యత్తులో భారత్ చేపట్టనున్న ప్రతిష్ఠాత్మక 'గగన్‌యాన్' మిషన్‌కు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు.

శుక్లా సాహసాన్ని, దేశభక్తిని ప్రధాని మోదీ ప్రశంసలతో ముంచెత్తారు. కేవలం సాంకేతిక విజయాన్నే కాకుండా, యువతరంలో స్ఫూర్తిని రగిలించారని అభినందించారు.

మరోవైపు, పార్లమెంటు సైతం శుభాంశు శుక్లా చారిత్రాత్మక విజయంపై ప్రశంసలు కురిపించింది. కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ మాట్లాడుతూ.. భారత అంతరిక్ష ప్రయోగాల చరిత్రలో శుక్లా మిషన్ ఒక సువర్ణాధ్యాయమని కొనియాడారు. అయితే ఈ ప్రత్యేక చర్చలో ప్రతిపక్షాలు పాల్గొనలేదు. కానీ కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ 'ఎక్స్' వేదికగా శుక్లాను అభినందించారు. "ప్రతి భారతీయుడు గర్వపడేలా శుభాంశు శుక్లా ఈ యాత్రను పూర్తి చేశారు. మన గగన్‌యాన్ కార్యక్రమానికి ఇది ఒక కీలకమైన మైలురాయి" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు.

## రాజధాని అమరావతి మునిగిపోయినట్లు..
# వైసీపీ దుష్ప్రచారం చేస్తుంది

(మొదటి పేజీ తరువాయి)

చేసినప్పటికీ, ఇరిగేషన్ శాఖ అధికారులు వాటిని ఖండిస్తూ ఫిర్యాదులు కూడా నమోదు చేసిన విషయాన్ని దేవినేని గుర్తుచేశారు. కంభంపాడు ప్రాంతంలో వాగులు పొంగిన దృశ్యాలను అమరావతితో కలిపి చూపించడం వైసీపీ బ్లూ మీడియా దుష్ప్రచారానికి నిదర్శనమని ఆయన స్పష్టం చేశారు.జగన్మోహన్ రెడ్డికి నిజంగా ధైర్యం ఉంటే అమరావతి వచ్చి సచివాలయం, అసెంబ్లీ, హైకోర్టు, ఎస్ఆర్ఎం యూనివర్సిటీ చూసి వెళ్ళాలి. అక్కడ నిర్మాణాలు ఎలా జరుగుతున్నాయో స్వయంగా పర్యవేక్షించి తెలుసుకోవాలి. కానీ తాడేపల్లి ప్యాలెస్‌లో కూర్చొని లేదా బెంగళూరు ప్యాలెస్‌లో సత్కారాలు చేసుకుంటూ ప్రజలను మభ్యపెట్టడం తప్ప వేరే పని చేయడం లేదు" అని ఉమా ధ్వజమెత్తారు. జగన్ పాలనలో అమరావతి రైతులపై దమనకాండ నడిపారని, వేలాది కేసులు పెట్టి జైలుకు పంపారని, పనులు ఆపేసి మూడు రాజధానుల పేరుతో ప్రజలను మోసగించారని ఆయన విమర్శించారు. "అదే కారణంగా ప్రజలు వైసీపీని 11 సీట్లకే పరిమితం చేశారు. తాజాగా పులివెందుల, ఒంటిమిట్టలో కూడా వైసీపీ ఓటమిపాలైంది. డిపాజిట్లు కోల్పోయే స్థితికి పడిపోయింది. ఇంత పరాభవం ఎదురైనా జగన్ అసలు సత్యాన్ని అంగీకరించకుండా దుష్ప్రచారమే చేస్తున్నారు" అని ఆయన ఎద్దేవా చేశారు.

**సూపర్ సిక్స్ పథకాలే వైసీపీ అసహనానికి కారణం :**

చంద్రబాబు సర్కారు ప్రారంభించిన 'సూపర్ సిక్స్' పథకాలు రాష్ట్రవ్యాప్తంగా విజయవంతమవుతున్నాయని, రైతులు, మహిళలు, పింఛన్ దారులు అందరూ లబ్ధి పొందుతున్నారని ఉమా తెలిపారు. "అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, స్త్రీ శక్తి, మూడు గ్యాస్ సిలిండర్లు, విద్యా పథకాలు ఇవన్నీ ప్రజల్లో విశేష ఆదరణ పొందుతున్నాయి. మహిళలు సోషల్ మీడియాలో తమ ఖాతాల్లో డబ్బులు పడుతున్న వీడియోలు పంచుకుంటుంటే జగన్ తట్టుకోలేక అసహనంతో ఫేక్ ప్రచారాలు చేస్తున్నారు" అని ఆయన ఆరోపించారు.

**జగన్ స్వాతంత్ర్య దినోత్సవం బహిష్కరణపై విమర్శ :**

ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో కూడా జగన్ హాజరుకాలేదని ఉమా విమర్శించారు. "దేశమంతటా అమరవీరులను స్మరించుకుంటూ జాతీయ పతాకాలు ఎగురవేస్తున్న వేళ, జగన్ మాత్రం ప్రజల ముందుకు రాకుండా తాడేపల్లి ప్యాలెస్‌లో తలదాచుకున్నారు. ఓటమి భయం, మానసిక అసహనం ఆయనను ఇంతలా దిగజార్చింది" అని ఆయన ఎద్దేవా చేశారు.

**దుష్ప్రచారం చేస్తే కఠిన చర్యలు తప్పవు :**

అమరావతి మునిగిపోయిందంటూ తప్పుడు కథనాలు ప్రచారం చేసే బ్లూ మీడియా, సోషల్ మీడియా పేజీలపై ప్రభుత్వం ఇప్పటికే కేసులు నమోదు చేసిందని దేవినేని ఉమా గుర్తుచేశారు. "ఇకపై కూడా ఎవరైతే ఇటువంటి ఫేక్ న్యూస్ వ్యక్తి చేస్తే వారిపై కఠిన చర్యలు తప్పవు. వాస్తవాలు ప్రజలకు తెలియజేయడం టీడీపీ బాధ్యతగా కొనసాగుతుంది" అని ఆయన స్పష్టం చేశారు

# వైసీపీ విష ప్రచారాన్ని తిప్పికొట్టండి

(మొదటి పేజీ తరువాయి)

ఏ ప్రచారాన్ని పరిశీలించినా వాళ్ల కుట్ర ఏంటో అర్థం అవుతుంది. తప్పుడు ప్రచారాలను ఎప్పటికప్పుడు ఖండించాలి... మంత్రులు, పార్టీ నేతలు ఈ విషయంలో మరింత చొరవ చూపాలి. లేకపోతే ప్రజలు ఆ తప్పుడు ప్రచారాలనే నిజం అని నమ్మే స్థాయికి తీసుకువెళతారు. మంచి గురించి మాట్లాడడమే కాదు... చెడు చేసే వారి గురించి కూడా ప్రజలను చైతన్య పరచాలి. మనపై చేసే అసత్య ప్రచారాలను దృష్టిలో పెట్టుకుని ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇంఛార్జ్‌లు, కార్యకర్తలు మరింత క్రమశిక్షణతో ఉండాలి" అని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం చేపట్టిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం విజయవంతమైందని చంద్రబాబు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 1.24 కోట్ల కుటుంబాలను నేరుగా కలిసి, ప్రభుత్వ పథకాలను వివరించామని అన్నారు. సాంకేతికతను ఉపయోగించుకుని నాయకుల పర్యటనలను పర్యవేక్షించామని... ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇంఛార్జ్‌లు ఏ గ్రామానికి ఏ సమయంలో వెళుతున్నారో యాప్ ద్వారా తెలుసుకున్నామని వెల్లడించారు. ప్రభుత్వ పథకాల అమలుపై ప్రజల్లో పూర్తి సంతృప్తి, సానుకూలత వ్యక్తమవుతోందని, ఎన్నికల్లో ఇచ్చిన సూపర్-6 హామీలను అమలు చేస్తుండటంతో ప్రజలు ప్రభుత్వాన్ని ఆశీర్వదిస్తున్నారని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలకు చంద్రబాబు పలు కీలక సూచనలు చేశారు. ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, అదే సమయంలో చెడు చేసే వారి గురించి కూడా ప్రజలను చైతన్యపరచాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర నేతల మాటలు, చేతలు పార్టీకి గానీ, ప్రభుత్వానికి గానీ చెడ్డపేరు తెచ్చేలా ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ మరింత బాధ్యతగా, క్రమశిక్షణతో వ్యవహరించాలని, వివాదాలకు ఏమాత్రం ఆస్కారం ఇవ్వొద్దని హెచ్చరించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు న్యాయం చేస్తామని చంద్రబాబు భరోసా ఇచ్చారు. ఇప్పటికే వ్యవసాయ మార్కెట్ కమిటీలు, కార్పొరేషన్లకు ఛైర్మన్‌లను నియమించామని, త్వరలోనే మిగిలిన నామినేటెడ్ పదవులను కూడా భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉపఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేసిన నేతలు, కార్యకర్తలను ఆయన అభినందించారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరగడం వల్లే ప్రజలు స్వచ్ఛందంగా ఓట్లు వేశారని, ఇది రాష్ట్రంలో మారిన రాజకీయ పరిస్థితులకు అద్దం పడుతోందని వ్యాఖ్యానించారు.

# దేశంలో ఓట్ల దొంగలు

(మొదటి పేజీ తరువాయి)

ఆయన మాట్లాడారు. ఓటు హక్కును దొంగిలించిన వారిని శిక్షించాలంటూ రాహుల్ గాంధీ పాదయాత్ర చేస్తున్నారనీ, త్వరలో తాను, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆ పాదయాత్రలో పాల్గొని మద్దతిస్తామని తెలిపారు.

అందరం కలిసికట్టుగా ఓట్ చోరీ కుట్రదారుల భరతం పట్టాలని పిలుపునిచ్చారు. రాహుల్ గాంధీ సూచనలను అమలు చేయడం తమ బాధ్యతనీ, ఆ క్రమంలో సమస్య వచ్చినప్పుడు పోరాడేందుకు బహుజనులు నైతిక మద్దతునివ్వాలని విజ్ఞప్తి చేశారు. విద్య ఒక్కటే బహుజనుల తలరాతలు మారుస్తుందని రేవంత్ చెప్పారు. నాణ్యమైన చదువు, ఉద్యోగాలు ఇచ్చే బాధ్యతను కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. బహుజనులంతా ఉన్నత చదువులు చదివి రాజ్యాధికారం సాధించాలనీ, బడుగు బలహీన వర్గాలకు రాజ్యాధికారం వచ్చినప్పుడే సమాజం బాగుపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మహనీయుల విగ్రహాలనేవి వర్ధంతులు, జయంతుల కోసం కాదనీ, అవి వారి స్ఫూర్తిని మనలో రగిలించేందుకేనని చెప్పారు. అందుకే రాష్ట్రానికి గుండెకాయ లాంటి సచివాలయం సమీపంలో పాపన్న గౌడ్ విగ్రహం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

**అడ్డుకుంటోంది వాళ్లే**

రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటున్నది కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ప్రధాని నరేంద్రమోడీనేనని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. బహుజనుల సామ్రాజ్యాన్ని స్థాపించిన గొప్ప పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న అని కొనియాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మైనింగ్ పేరుతో ఖిలాషాపూర్ కోట చరిత్రను కాలగర్భంలో కలిపేందుకు కుట్రలు పన్నిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆనాడే కోటపైకి వెళ్లి దాన్ని కాపాడి చారిత్రక పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చామని గుర్తు చేశారు. గత ప్రభుత్వంలో కేసీఆర్ చేసిన చట్టం బీసీలకు శాపంగా మారిందన్నారు. దాన్ని సవరిస్తూ చేసిన ఆర్డినెన్స్‌ను గవర్నర్‌కు పంపితే ఆయన రాష్ట్రపతికి పంపారని తెలిపారు. ఐదు నెలలు గడిచినా బిల్లులను ఆమోదించకపోవడంతో బహుజనుల కోసం ఢిల్లీలో ధర్నా సైతం చేశామని గుర్తు చేశారు. బహుజనుల కోసం తాము చేసిన ధర్నాకు బీజేపీ, బీఆర్ఎస్ నేతలు ఎందుకు రాలేదంటూ సీఎం నిలదీశారు. మత ప్రాతిపదికన రిజర్వేషన్లు రాజ్యాంగంలోనే లేవని గుర్తు చేశారు. అబద్ధాలతో బహుజనులకు అన్యాయం చేయాలని ఎందుకు చూస్తున్నారని ప్రశ్నించారు.

మహారాష్ట్ర, గుజరాత్, ఉత్తరప్రదేశ్‌లో బీసీల్లోని ముస్లింలకు రిజర్వేషన్లు తొలగించగలరా? అంటూ ప్రధాని మోడీకి సవాల్ విసిరారు. 56 ఏండ్లుగా ఇవి అమలవుతున్నాయనీ, ఇప్పుడు మతం ముసుగులో బహుజనుల రిజర్వేషన్లను బీజేపీ నేతలు అడ్డుకుంటున్నారని దుయ్యబట్టారు. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్‌ను తీర్చిదిద్దే నాయకత్వాన్ని గాంధీ కుటుంబం దేశానికి అందించిందని చెప్పారు. ఆ వారసత్వాన్ని కొనసాగిస్తూ దేశ సమగ్రత కోసం కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర నిర్వహించారని తెలిపారు. ఆ సందర్భంగా కులగణన చేసి తీరుతామని తెలంగాణ ప్రజలకు మాట ఇచ్చారనీ, గాంధీ కుటుంబం మాట ఇచ్చిందంటే అది శిలాశాసనమేనని స్పష్టం చేశారు.

రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం దేశంలో ఏ రాష్ట్రంలోనూ చేయని విధంగా తెలంగాణలో తాము కుల గణన చేసి చూపించామంటూ చెప్పారు. పక్కా ప్రణాళిక ప్రకారం శాస్త్రీయంగా దాన్ని పూర్తి చేశామని ధీమా వ్యక్తం చేశారు. కులగణన ద్వారా బహుజనుల సంఖ్య 56.33 శాతంగా ఉందంటూ తేల్చామన్నారు. విద్య, ఉద్యోగ, ఉపాధితోపాటు రాజకీయాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రెండు వేర్వేరు చట్టాలు చేసి కేంద్రానికి పంపామని గుర్తు చేశారు. రాహుల్ గాంధీపై కోపం ఉంటే ఆయనపైనే చూపాలనీ, అంతేగానీ ఆయన సిద్ధాంతాలపై చూపొద్దంటూ కేంద్రంలోని మోడీ సర్కారుకు హితవు పలికారు. కార్యక్రమంలో మంత్రులు అడ్లూరి లక్ష్మన్ కుమార్, వాకిటి శ్రీహరి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారుడు కే.కేశవరావు, జీహెచ్ఎమ్‌సీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద, బీసీ కార్పొరేషన్ చైర్మన్ శ్రీకాంత్ గౌడ్, వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్యతోపాటు పలువురు ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

**మా మూల సిద్ధాంతమే సామాజిక న్యాయం : డిప్యూటీ సీఎం భట్టి**

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ తమ పార్టీ మూల సిద్ధాంతమే సామాజిక న్యాయమని అన్నారు. తెలంగాణలో చేపడుతున్న సంస్కరణలు, నిర్ణయాలు దేశానికే దశ, దిశా, నిర్దేశం చేస్తున్నాయని ఆయన తెలిపారు. భారత చరిత్రలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో కులగణనను చేపట్టామని వివరించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం చట్టం చేశామని గుర్తు చేశారు.

# ఏపీకి కేంద్రం అండగా నిలవాలి

(మొదటి పేజీ తరువాయి)

ఇటీవల సెమీకండక్టర్ తయారీ యూనిట్‌ను మంజూరు చేసినందుకు కేంద్రానికి కృతజ్ఞతలు తెలిపిన లోకేశ్, భవిష్యత్ ప్రణాళికలకు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. ఏపీ టెక్నాలజీ ప్రగతికి సంబంధించిన భారీ ప్రతిపాదనలను కేంద్రమంత్రి ముందు ఉంచారు.

**భారీ ప్రాజెక్టులకు నిధులు, జాతీయ గుర్తింపు**

రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న పలు ప్రాజెక్టులకు జాతీయస్థాయి గుర్తింపుతో పాటు ఆర్థిక చేయూతను అందించాలని మంత్రి లోకేశ్ కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. అమరావతిలో ఏర్పాటు చేయనున్న 'క్వాంటమ్ వ్యాలీ పార్కు'ను దేశంలోనే మొట్టమొదటి జాతీయస్థాయి క్వాంటమ్ క్లస్టర్‌గా అధికారికంగా గుర్తించాలని కోరారు. ఈ ప్రాజెక్టు కోసం రూ. 1000 కోట్ల ఆర్థిక సహాయం అందించాలని అభ్యర్థించారు. అదేవిధంగా, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను 'నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'గా ప్రకటించి, రూ. 300 కోట్ల నిధులు కేటాయించాలని కోరారు. ఈ హబ్‌ను కేంద్ర ప్రభుత్వ 'ఇన్నోవేషన్ అండ్ డిజిటల్ హెల్త్ మిషన్'లో చేర్చాలని సూచించారు. 2026లో అమరావతిలో 'గ్లోబల్ క్వాంటమ్ సమ్మిట్', 'ఇండియా ఇన్నోవేషన్ వీక్' నిర్వహించేందుకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

**విధానపరమైన సంస్కరణలు.. ఐటీ విస్తరణే లక్ష్యం**

రాష్ట్రంలో ఐటీ పెట్టుబడులను ఆకర్షించి, యువతకు ఉపాధి అవకాశాలు పెంచడమే లక్ష్యంగా విధానపరమైన సంస్కరణలు చేపట్టాలని లోకేశ్ కోరారు. ముఖ్యంగా టైర్-3 నగరాలు, గ్రామీణ ప్రాంతాలకు ఐటీ పరిశ్రమను విస్తరించేందుకు ఆదాయపు పన్ను మినహాయింపులు ఇవ్వాలన్నారు. ఇందుకోసం 'పర్మినెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్' నిబంధనలను తక్షణమే సవరించాలని సూచించారు. విదేశీ క్లౌడ్ సర్వీస్ ప్రొవైడర్లు మన దేశంలో పెట్టుబడులు పెట్టేందుకు, ప్రపంచ పోటీతత్వాన్ని పెంచేందుకు ఈ మార్పులు అవసరమని వివరించారు. రాష్ట్రంలో మేధో సంపత్తిని కాపాడుతూ, ఏఐ శిక్షణ, టెక్స్ట్ అండ్ డేటా మైనింగ్ (%ఐఐవీ%) వంటి ఆధునిక సాంకేతికతలను ప్రోత్సహించేందుకు కాపీరైట్ చట్టంలోని సెక్షన్-52కు సవరణలు చేయాలని కోరారు.

**విద్య, మౌలిక వసతుల అభివృద్ధికి చేయూత**

రాష్ట్రంలో డిజిటల్ మౌలిక సదుపాయాలను బలోపేతం చేసేందుకు కేంద్రం సహకరించాలని లోకేశ్ అన్నారు. గ్లోబల్ డేటా సెంటర్ల పెట్టుబడులను ఆకర్షించేందుకు విశాఖపట్నంలో సముద్రగర్భ కేబుల్ ల్యాండింగ్ పనులను వేగవంతం చేయాలని కోరారు. జాతీయ విద్యా విధానం-2020 కింద రాష్ట్రంలో ఏఐ యూనివర్సిటీ ఏర్పాటు, పాఠశాల స్థాయిలోనే స్టెమ్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథ్స్) పాఠ్యాంశాలను ప్రవేశపెట్టడానికి కేంద్రం మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఐఐటీ, ఐఐఎస్సీల సహకారంతో అమరావతిలో 'నేషనల్ క్వాంటమ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్', 'డీప్ టెక్ స్కిల్ అకాడమీ' ఏర్పాటు చేసే ఆలోచన ఉందని తెలిపారు.

**రాష్ట్ర ప్రగతిపై ప్రజెంటేషన్.. కేంద్రం సానుకూలత**

ఈ సమావేశంలో మంత్రి లోకేశ్, రాష్ట్రంలో ఇప్పటికే అమలవుతున్న ప్రతిష్ఠాత్మక ఇన్నోవేషన్ ప్రాజెక్టులపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కేంద్రమంత్రికి వివరించారు. డేటా లేక్, ఆర్టీజీఎస్ లెన్స్, పీజీఆర్ఎస్, అన్నదాత సుఖీభవ, డ్రోన్ మార్ట్ వంటి ఫ్లాగ్‌షిప్ ప్రాజెక్టుల పనితీరును తెలియజేశారు. క్వాంటమ్ వ్యాలీ, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లను 'వికసిత్ భారత్-2047'లో భాగంగా బ్రాండింగ్ చేసి, జాతీయ ఆవిష్కరణల్లో ఏపీని ముందంజలో ఉంచేందుకు మద్దతు ఇవ్వాలని కోరారు. మంత్రి లోకేశ్ సమర్పించిన ప్రతిపాదనలపై కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ సానుకూలంగా స్పందించారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, టెక్ ఇంక్యుబేషన్, క్వాంటమ్, బయోటెక్ వంటి రంగాల్లో ఎంఎస్ఎంఈలను ప్రోత్సహించడానికి అవసరమైన సంస్కరణలను ఏపీలో అమలు చేసేందుకు కేంద్రం తరఫున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

# రాష్ట్రంలో కొత్త మద్యం పాలసీ ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ తో కలిసి ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ నిషాంత్ కుమార్ పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జీవో ఎంఎస్ 275 ద్వారా ఈ నెల 13 న నూతన మద్యం పాలసీ విడుదల చేసిందన్నారు. సెప్టెంబర్ 1, 2025 నుంచి మద్యం పాలసీపై రాష్ట్రంలో కొత్త విధానం అమల్లోకి వస్తుందన్నారు. 1 సెప్టెంబర్, 2025 నుంచి 31 ఆగస్టు, 2028 వరకు ఈ విధానం వచ్చే మూడేళ్ల పాటు రాష్ట్రంలో అమలులో ఉంటుందన్నారు. గతంలో వేలం వేయడం ద్వారా బార్లను కేటాయించగా, ఇప్పుడు లాటరీ పద్ధతిని అమలు చేస్తున్నామన్నారు. దీనికోసం 840 బార్లకు నోటిఫికేషన్ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కొత్త విధానంలో ఉదయం 10 నుంచి రాత్రి 12 గంటల వరకు బార్లు తెరిచి ఉంటాయన్నారు. ప్రస్తుత పాలసీ ప్రకారం రాత్రి 11 గంటల వరకు మాత్రమే బార్లు తెరిచి ఉండేవన్నారు. 50 వేల లోపు జనాభా ఉంటే రూ. 35 లక్షలు, 5 లక్షల లోపు జనాభా ఉంటే రూ. 55 లక్షలు, 5 లక్షల పైన జనాభా ఉంటే రూ. 75 లక్షల చొప్పున బార్ల లైసెన్స్ ఫీజు కట్టాల్సి ఉంటుందన్నారు. ప్రతి ఏడాది 10 శాతం లైసెన్స్ ఫీజు అన్ని కేటగిరీలకు పెరుగుతుందన్నారు. గీత కార్మికుల కులాల కోసం 10 శాతం బార్లను రాష్ట్ర ప్రభుత్వం రిజర్వ్ చేసిందన్నారు. వీటికి సాధారణ బార్ ల లైసెన్సు రుసుముల్లో 50 శాతం తక్కువగా రుసుముగా ఉండనుందన్నారు. అన్ని బార్లను లాటరీ పద్ధతిన జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో తీయడం జరుగుతుందన్నారు. గతంలో బార్ లైసెన్స్ పొందాలంటే రెస్టారెంట్ లైసెన్స్ ముందే ఉండాల్సి ఉండేదన్నారు. ఈ సారి ఈ నిబంధనను సడలించడం జరిగిందన్నారు. 15 రోజుల్లో రెస్టారెంట్ ఏర్పాటు చేసుకునే సౌలభ్యాన్నిప్రభుత్వం కల్పించింది కాని కొన్ని సందర్భాల్లో ఇంకో 15 రోజుల్లోగా రెస్టారెంట్ ఏర్పాటు చేసుకునే సౌలభ్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందన్నారు. ప్రతి ఏడాది 10 శాతం ఫీజు పెంచుతామన్నారు. గతంలో ఒకేసారి ఆగస్ట్ లోపు లైసెన్స్ ఫీజు కట్టాల్సి ఉండేదన్నారు. ఈసారి 6 సార్లుగా చెల్లింపులు చేయవచ్చున్నారు. ఇవాల్టి నుంచి ఈ నెల 26 వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. 28 న లాటరీ తీసి బార్లు కేటాయిస్తామన్నారు. ధరఖాస్తుదారులు అప్లికేషన్లను ఆన్ లైన్, ఆఫ్ లైన్, హైబ్రిడ్ మోడ్ లోనూ ధరఖాస్తు చేసుకోవచ్చున్నారు. సెప్టెంబర్ 1 నుంచి కొత్త పాలసీ అందుబాటులోకి వస్తుందన్నారు. ఎంతో పారదర్శకంగా బార్ పాలసీ తీసుకురావడం జరుగుతుందన్నారు. కొత్త వారు ఈ బిజినెస్ లోకి రావడానికి కొన్ని మార్పులు చేశామన్నారు. గతంలో బార్లు ఉదయం 11 నుంచి రాత్రి 11 గంటల వరకు ఉండేవన్నారు. ఈసారి ఉదయం 10 నుంచి రాత్రి 12 వరకు బార్లకు అనుమతి ఉంటుందన్నారు. అన్ని కేటగిరీలో అప్లికేషన్ ఫీజు 5 లక్షలు గా నిర్ణయించామన్నారు. గతంలో కేటగిరీల బట్టి 7.5 లక్షలు, 10 లక్షల వరకు బార్ల అప్లికేషన్ ఫీజు ఉండేదన్నారు. కొన్ని చోట్ల మద్యం సిండికేట్లు కొత్త వారిని రాకుండా చేసే అవకాశం ఉందని, వాటిని ఆపేందుకు కొత్త నిర్ణయాలు తీసుకున్నామన్నారు. గతంలో కంటే లైసెన్స్ ఫీజు 70 నుంచి 50 శాతానికి తగ్గాయన్నారు. ఎయిర్ పోర్ట్స్ లో బార్ల లైసెన్స్ కు ప్రభుత్వం నుంచి త్వరలో గైడ్ లైన్స్ రావాల్సి ఉందన్నారు.

# భారత రాష్ట్రపతిని కలిసిన అనంతపురం జిల్లా యువకుడు

(మొదటి పేజీ తరువాయి)

దేశ వ్యాప్తంగా ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించాలనే అభిప్రాయంతో ఒక వినతిపత్రాన్ని సమర్పించారు.

సంవిధాన్ సపోర్ట్ గ్రూప్ ఈ ఉద్యమాన్ని బలపరచేందుకు ఇప్పటివరకు 320 మందికిపైగా పార్లమెంట్ సభ్యులను కలిసింది. లక్షలాది మంది యువతతో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఢిల్లీలోని జంతర్ మంతర్‌లో ఒక రోజు నిరాహార దీక్ష చేసింది. 2000 మందికిపైగా యువతతో భారత పార్లమెంటు వరకు శాంతియుతంగా నిరసన ర్యాలీ చేపట్టారు. అంతేకాకుండా జాతీయ యువజన పురస్కార గ్రహీతలు మరియు ఎన్ ఎస్ ఎస్ అవార్డు గ్రహీతల నుంచి 112 మంది సంతకాలు చేసిన అభ్యర్థన పత్రాలను రాష్ట్రపతికి అందించారు. ఈ సమావేశంలో బిసాతి భరత్ "వన్ నేషన్ వన్ ఎలెక్షన్" ప్రాధాన్యతను రాష్ట్రపతి గారికి వివరించారు. ఇది పాలనలో నిష్క్రియతను తగ్గించి, ఎన్నికల ఖర్చులను తగ్గించి, మద్యపాన మరియు మాదకద్రవ్యాల వినియోగాన్ని తగ్గించడంతో పాటు నల్లధనం ప్రవాహాన్ని నియంత్రించడంలో సహాయ పడుతుందన్నారు. రాజకీయ నాయకులు ప్రచారానికి ఖర్చు చేసే సమయం తగ్గి, ఓటర్ల అలసట తగ్గి, పరిపాలన వ్యవస్థ బలపడుతుందని చెప్పారు. దీనివల్ల ఆర్థిక వ్యవస్థ కూడా బలపడే అవకాశముందని పేర్కొన్నారు. వీరు చేసిన కృషిని రాష్ట్రపతి ప్రశం సిస్తూ, వారి విజ్ఞప్తిని సానుకూలంగా స్వీకరించారు. "సంవిధాన్ సపోర్ట్ గ్రూప్" యువత చూపిన నిబద్ధతను ప్రశంసించారు.

# సంపాదకీయం

## అలాస్కా ఆశలు ముగిసినట్టే




అధికారంలోకి వచ్చిన 24 గంటల్లో యుద్ధాలన్నీ ఆపేస్తా.. అమెరికా అధ్యక్ష ఎన్నికల సమయంలో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా డొనాల్డ్ ట్రంప్ అమెరికన్లకు ఇచ్చిన హామీ ఇది. కానీ.. ఎన్నికల్లో గెలిచి 9 నెలలైంది. అధికారం చేపట్టి ఆరు నెలలు దాటింది. ఉక్రెయిన్?రష్యా యుద్ధం, ఇజ్రాయెల్?ఇరాన్, హమాస్ యుద్ధం కొనసాగింది. ఇటీవలే సీజ్‌ఫైర్ జరిగింది. ఇక ట్రంప్ అధికారంలోకి వచ్చాక భారత్, పాకిస్తాన్, థాయ్‌లాండ్?కంబోడియా యుద్ధాలు జరిగాయి. ముఖ్య విషయం ఏమిటంటే.. అమెరికా ఇరాన్‌పై దాడి చేసింది. ఈ క్రమంలో తనకు నోబెల్ శాంతి బహుమతి కావాలని మోజు పడుతున్న ట్రంప్.. ఎట్టకేలకు రష్యా?ఉక్రెయిన్ వార్ ఆపేందుకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య అలాస్కాలో జరిగిన ఒక ముఖ్యమైన సమావేశం శుక్రవారం జరిగింది. అయితే ఉక్రెయిన్ యుద్ధానికి సంబంధించి ఎటువంటి అధికారిక ఒప్పందం లేకుండానే ముగిసింది. రెండున్నర గంటలకు పైగా సాగిన ఈ చర్చలు, అనేక అంశాలపై దృష్టి సారించినప్పటికీ, శాంతి ఒప్పందం కుదరకపోవడం గమనార్హం. ఈ సమావేశం రెండు దేశాల మధ్య సంబంధాలను మెరుగుపరచడంలో ఒక అడుగుగా భావించబడినప్పటికీ, పలు సమస్యలు ఇంకా పరిష్కారం కాలేదు.సమావేశం అనంతరం ట్రంప్ తన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో సమావేశాన్ని ఫలప్రదమైనదిగా అభివర్ణించారు. అనేక అంశాలపై చర్చలు జరిగాయని, కొంత పురోగతి సాధించినప్పటికీ, కొన్ని కీలక సమస్యలు ఇంకా పరిష్కారం కావాల్సి ఉందని వెల్లడించారు. అధికారిక ఒప్పందం కుదరాలంటే, అన్ని విషయాలపై రాజీ సాధించి సంతకాలు చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. త్వరలో ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోదిమిర్ జెలెన్స్కీ?క, యూరోపియన్ యూనియన్ నాయకులతో సంప్రదింపులు జరుపుతానని, అలాగే పుతిన్‌తో మరోసారి సమావేశమవుతానని ట్రంప్ పేర్కొన్నారు.పుతిన్ ఈ సమావేశాన్ని నిర్మాణాత్మకంగా అభివర్ణించారు, ఉక్రెయిన్‌తో యుద్ధాన్ని ముగించేందుకు తాను నిజాయతీగా ఉన్నానని వ్యక్తం చేశారు. ఈ భేటీ వివాదానికి ముగింపు పలకడానికి ఒక ప్రారంభ దశగా ఉంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కానీ, ట్రంప్‌తో తన సంబంధాన్ని వ్యాపార లాంటిదిగా పేర్కొన్న పుతిన్, ట్రంప్ అధికారంలో ఉండి ఉంటే ఉక్రెయిన్ యుద్ధం జరిగి ఉండేది కాదని వ్యాఖ్యానించారు. అలాగే, రష్యా?అమెరికా సంబంధాలను మెరుగుపరచడంలో ట్రంప్ పాత్రను కొనియాడారు.అమెరికా అధ్యక్షుడు డోనల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య అలాస్కాలో అత్యంత కీలక సమావేశం జరిగింది.యుక్రెయిన్ యుద్ధంలో శాంతిని తీసుకొచ్చేందుకు దీన్నొక ముఖ్య ఘట్టంగా పరిగణించారు.కానీ, ఎలాంటి ఒప్పందం, కాల్పుల విరమణ ప్రకటన లేకుండా ఈ సమావేశం ముగిసింది.ఈసారి మాస్కోకు రావాలని మాత్రమే ఆహ్వానం అందింది.మూడు గంటల పాటు జరిగిన సమావేశంలో ఎన్నో ప్రశ్నలు తలెత్తాయి. వాటిల్లో కొన్నింటికే సమాధానాలు లభించాయి.మూడు సంవత్సరాలకు మించిన కాలం నుంచి ఉక్రెయిన్ తో రణం సాగిస్తూ.. ప్రపంచం మీద తన పట్టును నిరూపించుకుంటున్నారు.ఉక్రెయిన్ తో యుద్ధాన్ని నిలిపివేయడానికి ఇటీవల అలస్కా లో అమెరికా అధ్యక్షుడు ట్రంప్, రష్యా అధ్యక్షుడు పుతిన్ భేటీ అయ్యారు. సాధారణంగా రెండు అగ్రరాజ్యాల అధిపతులు భేటీ అయితే ప్రపంచమంతా ఆసక్తిగా చూస్తుంది. వీరిద్దరి భేటీని కూడా ప్రపంచ దేశాలు ఆసక్తిగానే చూసాయి.. అయితే గ్లోబల్ మీడియా వీరిద్దరి భేటీ మీద ఒక సంచలన కథనాన్ని ప్రసారం చేసింది.. ఎందుకంటే అలస్కాలో ట్రంప్ తో భేటీ అయింది పుతిన్ కాదని.. అతడి బాడీ డబుల్ అని సంచలన కథనాన్ని ప్రసారం చేసింది. చెవుల వెంట్రుకలు ఉన్నాయని.. చర్మం ముడతలుగా కాకుండా కాంతివంతంగా కనిపిస్తోందని.. నిటారుగా నడవకుండా.. కాస్త వంగి వెళ్తున్నారని.. అసలు పుతిన్ ఇలా ఉండాలని గ్లోబల్ మీడియా తన కథనంలో పేర్కొంది. గ్లోబల్ మీడియా తన ప్రసారం చేసిన కథనానికి బలమైన ఆధారాలు కూడా చూపించింది.సినిమాల్లో హీరోలు డూప్ ల సహాయంతో కొన్ని సన్నివేశాలలో నటిస్తుంటారు. రాజకీయ నాయకులకు కూడా డూప్ లు ఉంటారని? పుతిన్ నిరూపించారు. వాస్తవానికి పుట్టిన కొంతకాలంగా పార్కిన్ సన్ వ్యాధితో బాధపడుతున్నారు. ఆయన కాళ్లు సరిగా పనిచేయడం లేదని.. చేతులు కూడా సహకరించడం లేదని వార్తలు వినిపిస్తున్నాయి. క్రమక్రమంగా ఆయన ఆరోగ్యం కూడా క్షీణిస్తోందని.. అధికారిక కార్యక్రమాలను, సమీక్షలను నిర్వహించలేక పోతున్నారని సమాచారం. కొన్ని సందర్భాలలో ఆయన శరీరం కూడా వణికి పోతున్నదని సోషల్ మీడియాలో కొన్ని వీడియోలు చక్కర్లు కొడుతున్నాయి.సరిగ్గా రెండు సంవత్సరాల క్రితం ఉక్రెయిన్ లో పర్యటించారు. మారియా పోల్ నగరంలో కలియతిరి గారు. యుద్ధం మొదలైన సందర్భంగా మరియాపోల్ ఉక్రెయిన్ లో ఉండేది. తర్వాత దానిని రష్యా స్వాధీనం చేసుకుంది. ఇది ఈ రెండు దేశాలకు సరిహద్దులో ఉంటుంది. అయితే నాడు ఆ నగరంలో పర్యటించినప్పుడు పుతిన్ స్వయంగా కారు నడిపారు. రష్యా చేస్తున్న కార్యక్రమాలను పరిశీలించారు. అయితే దీనిని రష్యా మీడియా గొప్పగా పేర్కొనగా.. ఇతర గ్లోబల్ మీడియా రంధ్ర అన్వేషణ చేసింది. పార్కిన్ సన్ వ్యాధితో బాధపడుతున్న వ్యక్తి కారు ఎలా డ్రైవ్ చేస్తారని వాదించింది. కారు నడిపింది పుతిన్ కాదని.. అతని మాదిరిగా ఉన్న బాడీ డబుల్ అని అంతర్జాతీయ మీడియా వ్యాఖ్యానించింది. ఇప్పుడు అదే అంశాన్ని గ్లోబల్ మీడియా ప్రస్తావిస్తోంది. పుతిన్ ఆరోగ్యం బాగోలేదని.. అందువల్లే ట్రంప్ తో భేటీకి బాడీ డబుల్ ను పంపించారని గ్లోబల్ మీడియా ఆరోపిస్తోంది. మరి దీనిపై రష్యా ఎలా స్పందిస్తుందో చూడాల్సి ఉంది.యుక్రెయిన్ యుద్ధం విషయంలో ఎలాంటి శాశ్వత పరిష్కారం లభించనప్పటికీ, రష్యా, అమెరికాల మధ్య సంబంధాలను ఈ సమావేశం మరింత దగ్గర చేసింది.ఇరు నేతలు కరచాలనం చేసుకున్న ఫోటోలు, నవ్వుతూ పలకరించుకోవడం వంటివి సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.పుతిన్ కోసం అమెరికా సైనికులు రెడ్ కార్పెట్ పరుస్తున్న చిత్రాలు కూడా సోషల్ మీడియాలో కనిపించాయి.కాగా.. 2020 ఎన్నికల్లో తాను గెలిచి ఉంటే, యుక్రెయిన్‌తో యుద్ధం ప్రారంభమయ్యేది కాదని ట్రంప్ పదేపదే చెప్తున్న మాటలతో పుతిన్ కూడా ఏకీభవించారు.గొప్ప పురోగతి ఉందని ట్రంప్ చెబుతున్నప్పటికీ, అలాస్కా సమావేశం ఎలాంటి స్పష్టమైన ఫలితాలను ఇవ్వకుండానే ముగిసింది.వచ్చే సమావేశం రష్యాలో జరిగే అవకాశం ఉందని మాత్రం నేతలిద్దరూ సంకేతాలిచ్చారు.”బహుశా, త్వరలోనే మిమ్మల్ని మళ్లీ కలుసుకుంటాను” అని ట్రంప్ అన్నారు. ఎలాంటి వాగ్దానం, రాజీ లేకుండా.. “వచ్చేసారి మాస్కోలో” అంటూ ఇంగ్లీష్‌లో జోక్ వేసేందుకు పుతిన్ చాలా సౌకర్యంగా ఫీలైనట్లు అనిపించింది.ట్రంప్ నవ్వుతూ.. “ఓ.. దట్స్ ఇంట్రెస్టింగ్, దానికి నేను విమర్శలు ఎదుర్కొంటాను. కానీ, యెస్, ఇది జరుగుతుందని నేను భావిస్తున్నా” అని చెప్పారు.

# క్లిక్.. క్లిక్..


## నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

ఎన్నో భావాలను ఒక్క చిత్రంతో తెలిపే గొప్పదనం ఒక్క ఫొటోగ్రఫీకి ఉంది. ఈ ఆధునిక కాలంలో మానవజీవితంతో ఫొటోగ్రఫీకి విడదీయలేని బంధం ఉంది. ఫొటోగ్రఫీకి శతాబ్దాల చరిత్ర ఉంది. ప్రపంచ ఛాయాచిత్ర దినోత్సవం ఆగస్టు 19న ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటారు. లూయిస్ డాగ్యురే అభివృద్ధి చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఫోటోగ్రా ఫర్‌లను ఏకం చేయడానికి మరింత మందిని ప్రోత్సహించే లక్ష్యంతో ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం ప్రతి సంవత్సరం ఆగస్టు 19 న ప్రపంచ స్థాయిలో జరుపుకుంటారు. ఫోటోగ్రఫీ అనేది గ్రీకు పదం నుండి వచ్చింది. ఫొటో అంటే కాంతి, గ్రాఫి అంటే తీసుకోవడం. ప్రపంచ ఫోటో దినోత్సవం, దీనిని 19 ఆగష్టు 1910న మొదటగా జరుపుకున్నారు. ఫోటోగ్రఫీ దినోత్సవం డాగ్యురో అనే శాస్త్రవేత్త ఆవిష్కరణల నుండి ఉద్భవించింది. ఫ్రెంచ్‌దేశానికి చెందిన లూయిస్ డాగ్యురే, జోసెఫ్ నైస్‌ఫోర్ నీప్స్ అభివృద్ధి చేసిన ఫోటోగ్రఫీ ప్రక్రియల గురించి 1839 జనవరి 9న ఫెంచ్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ డాగ్యూరే టైప్ ప్రాసెస్‌ను అధికారికంగా ప్రకటించింది. తర్వాత కొద్దినెలలకు 1839 ఆగస్టు 19న ఫ్రాన్స్ ప్రభుత్వం ఫోటోగ్రఫీపై పెటెంట్ హక్కులను కొనుగోలు చేసి




దానిని ప్రపం చానికి ఉచిత బహుమతిగా అందించింది. అందుకే ఏటా ఆగస్టు 19ని ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్స వంగా జరుపుతున్నారు. ఇండియా ఇంటర్నేషనల్ ఫొటోగ్రఫిక్ కౌన్సిల్ 1991 నుంచి దేశంలో ప్రతియేటా ఆగస్టు 19న ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని జరుపడం ప్రారం భించింది. మనదేశంలో 1840లోనే ఫొటోగ్రఫీ కి సంబంధించిన ఆనవాళ్ళు ఉన్నాయి. మొట్ట మొదటిగా కలకత్తాలో కేలోటైపు మొదటి ఫొటోగ్రఫీ స్టూడియో స్థాపించారు. ఇదే భారతదేశంలో మొట్టమొదటి స్టూడియో. ఇప్పటికి 8 చౌరంగీరోడ్డు కల కత్తాలో నిల్చి ఉన్నది.1854లో ఫొటో గ్రాఫిక్ సొసైటీ ఆఫ్ బాంబే స్థాపించబడింది. మనదేశంలో ఇది మొట్టమొదటి ఫొటోక్లబ్బు. ఆ తర్వాత ఇది ఫొటోగ్రఫీ సొసైటీ ఆఫ్ ఇండియాగా మార్పు చెందింది. అప్పట్లో కేవలం బ్రిటీష్‌రాజు, జమిందారులకు మాత్రమే దీన్ని ఉపయోగించేవారు. 1877 నుంచి ఫొటోగ్రఫీ సామాన్యులకు అందుబాటులోకి వచ్చింది. జేఎన్‌టీయూలో బ్యాచ్‌లర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్, ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వెంకటేశ్వర ఫైనార్ట్స్ కళాశాల, లకోటియా ఫ్యాషన్ ఇన్‌స్టిట్యూట్‌లలో ఫొటోగ్రఫీలో శిక్షణనిస్తున్నారు. వీటిలోనే కాకుండా పలు ప్రైవేట్ శిక్షణ కేంద్రాల్లో కూడా ఫొటోగ్రఫీలో శిక్షణ ఇస్తున్నారు. ఫొటోగ్రఫీ నాలుగేళ్ల కోర్సులో ఎనిమిది సెమిస్టర్లుంటాయి. 30 సీట్లను ప్రవేశపరీక్ష ద్వారా భర్తీ చేస్తారు.ఫ్యాషన్, పారిశ్రామిక, పర్యాటక, ట్రావెల్, జర్నల్‌లకు సంబం ధించి ఫొటోగ్రఫీ, కంప్యూటర్ గ్రాఫిక్స్‌లో కూడా శిక్షణ ఉంటుంది.ఫొటోగ్రఫీలో ఒకప్పుడు పురుషులు మాత్రమే ఉండేవారు. కానీ ప్రస్తుతం పురుషులతో సమానంగా మహిళలు కూడా ఈ రంగంపై మక్కువ కనబరుస్తున్నారు.

# కార్యకర్తలకు లోకేశ్ కిక్..



**కాకినాడ–సూర్య వాస్తవం:** తెలుగుదేశం పార్టీని మూడు రకాలుగా చూడాలి. ఒకటి ఎన్టీ రామారావు హయాంలో.. పార్టీ ఆవిర్భావం నుంచి 1995 వరకూ ఎన్టీఆర్ మాట వేదంగా ఉండేది. పార్టీ క్యాడర్‌కు ఆయన మాటలు పూర్తి స్థాయిలో మత్తు నిచ్చేవి. ఆయన డైలాగులతో, హావభావాలతోనే ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారి పార్టీ పెట్టి ఎనిమిది నెలల్లో అధికారంలోకి తెచ్చిన చరిత్రను గడించారు. అయితే తర్వాత ఆయన శకం పూర్తయిన తర్వాత ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు 1995 నుంచి వచ్చారు. చంద్రబాబు నాయుడు ఆచితూచి వ్యవహరించేవారు. అధికారంలో ఉన్నప్పుడు క్యాడర్ మనసులో ఉన్నది గుర్తించ లేకపోయేవారని, అధికారంలో లేనప్పుడు మాత్రం ఆయనకు కార్యకర్తలు గుర్తుకు వచ్చేవారని ఇప్పటికీ పార్టీలో నేతలు అంటుంటారు.1995 నుంచి 2024 వరకూ చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా, పార్టీ అధినేతగా ఆయన నాలుగు సార్లు తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తెచ్చారు. చంద్రబాబు నాయుడు స్వయం శక్తితో ఎదిగిన నేత. తన వ్యూహాలు, రాజకీయ ఎత్తుగడలతో ఎన్టీఆర్ స్థాపించిన పార్టీని ఇప్పటి వరకూ లాక్కుని వచ్చారంటే ఆయన శ్రమ ఫలితమే. నందమూరి వారసులకు పార్టీ చిక్కి ఉంటే ఏమయి పోయి ఉండేదో తెలియదు కానీ, చంద్రబాబు చేతిలో పార్టీ మూడు పువ్వులు, ఆరు కాయలుగా వర్ధిల్లిందని అనేవారు ఇప్పటికీ సీనియర్ నేతలున్నారు. ప్రతి ఎన్నికకు తన వ్యూహాన్ని మారుస్తూ.. ఎక్కడ తగ్గాలో.. ఎక్కడ నెగ్గాలో తెలిసిన నేత చంద్రబాబు నాయుడు అని వేరే చెప్పాల్సిన పనిలేదు. కానీ ఆయన సాఫ్ట్ కార్నర్ సీనియర్ నేతలకు నచ్చుతుందేమో కానీ యువనేతలకు, క్యాడర్ కు నచ్చదుఇక పార్టీ అధినేతగా చంద్రబాబు నాయుడు ఉన్నప్పటికీ, ముఖ్యమంత్రిగా ఆయన కొనసాగుతున్నప్పటికీ ప్రస్తుతం మాత్రం పార్టీలో, ప్రభుత్వంలో లోకేశ్ మాట చెల్లుబాటు అవుతుంది. యువగళం పాదయాత్రతో కార్యకర్తల మనోభావాలను తెలుసుకున్న చినబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు పరుస్తున్నారు. ముఖ్యంగా రెడ్ బుక్ నుంచి నిన్న మొన్నటి పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నిక వరకూ లోకేశ్ ఆదేశాలే పార్టీకి హైప్ తెచ్చాయని చెప్పాలి. గత ప్రభుత్వంలో తాము అనుభవించిన ఆవేదనను చినబాబు తీర్చేస్తున్నారని క్యాడర్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నాడు అధికారంలో ఉన్నప్పుడు తమపై చెలరేగిన నేతలను అరెస్ట్ చేయించడంలో చినబాబు ఆదేశాల వల్లనే జరిగిందని బలంగా క్యాడర్ నమ్ముతుంది. అందుకు తగ్గట్లుగానే లోకేశ్ కూడా ఎక్కడకు వెళ్లినా క్యాడర్ తో మమేకమవుతున్నారు. గత ప్రభుత్వంలో తమ పార్టీ నేతలకు, క్యాడర్ కు అన్యాయం చేసిన వారిని వదలడం లేదు. వారు అధికారులు కావచ్చు. ప్రజాప్రతినిధులు కావచ్చు. కత్తికి .. కత్తి.. కేసుకు.. కేసు అన్న రీతిలో ఆయన బదులివ్వడం పసుపు పార్టీ క్యాడర్ లో మంచి హుషారును ఇస్తుంది. అంతేకాదు ఫుల్లు కిక్కుకూడా ఇస్తుంది. అందుకే చినబాబు లోకేశ్ క్యాడర్ గురించి చేసే ఏ ఆలోచనలోనూ వెనుకంజ వేయడం లేదు. ఒకరకంగా చెప్పాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రిగా బిజీగా గడుపుతున్నప్పటికీ పార్టీ బాగోగులను, క్యాడర్ సంక్షేమాన్ని మాత్రం లోకేశ్ పట్టించుకుంటున్నారని సోషల్ మీడియాలో కూడా పెద్దయెత్తున ఆయనను ప్రశంసిస్తూ పోస్టింగ్ లు కనిపిస్తున్నాయి. మొత్తం మీద నారా లోకేశ్ ప్రత్యర్థులను తొక్కి నార తీస్తున్నాడన్న సంతోషం మాత్రం తెలుగు తమ్ముళ్లలో ఉంది.

# రెండు గ్రూపులు, మూడు కొట్లాటలు

**అనంతపురం –సూర్య వాస్తవం:** తెలుగుదేశం పార్టీ నేతల మధ్య విభేదాలు రచ్చకెక్కుతున్నాయి. వీధుల్లోకి ఎక్కి ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకునే స్థాయికి వచ్చారు. రెండు గ్రూపులు, మూడు కొట్లాటలుగా మారి అనంతపురం అర్బన్ టీడీపీలో నేతలు డైరెక్ట్ ఫైట్ కు దిగారు. ప్రస్తుత ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి వర్గాల మధ్య బాహాబాహీ జరుగుతుంది. గతంలో కొన్ని విషయాల్లో వివాదాలు తలెత్తినా అధినాయకత్వం జోక్యంతో రాజీ కుదిరినట్లే కుదరి మళ్లీ ముదిరింది. ప్రస్తుత ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే వర్గాల మధ్య మాత్రం గ్యాప్ ఇక ఎవరూ పూడ్చలేనంత లోతుకు వెళ్లిపోయిందని స్థానిక టీడీపీ నేతలే వ్యాఖ్యానిస్తున్నారు. దీంతో అనంతపురం అర్బన్ లో టీడీపీ వివాదానికి ఇప్పట్లో చెక్ పడే అవకాశం కనిపించడం లేదు. 2024 ఎన్నికల్లో తనకు అనంతపురం అర్బన్ సీటు దక్కుతుందని ప్రభాకర్ చౌదరి గట్టిగా భావించారు. పార్టీకి విధేయతగా ఉన్న తనను కాదని మరొకరికి సీటు దక్కే అవకాశం లేదని ఆయన భావించారు. జనసేన నుంచి తనకు థ్రెట్ ఉంటుందని ఆయన అంచనా వేశారు కానీ, సొంత పార్టీ నేతల నుంచే తన సీటు కిందకు నీరు చేరుతుందని ఎన్నికల అభ్యర్థుల ప్రకటన వరకూ ఆయన ఊహించి ఉండకపోవచ్చు. ఊహించని రీతిలో రాప్తాడుకు చెందిన దగ్గుబాటి ప్రసాద్ కు అనంతపురం అర్బన్ టీడీపీ టిక్కెట్ లభించింది.

అయితే అధినాయకత్వం ఆదేశం మేరకు లోపల అసంతృప్తి ఉన్నప్పటికీ ప్రభాకర్ చౌదరి ప్రసాద్ గెలుపునకు తన వంతు ప్రయత్నం చేశారు. అయితే ఎన్నికల ఫలితాల తర్వాత నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన దగ్గుబాటి ప్రసాద్ మాజీ ఎమ్మెల్యే వర్గాన్ని దూరంగా పెట్టడం ప్రారంభించారు. తన వర్గాన్ని ప్రోత్సహిస్తూ





అన్ని విషయాల్లో వారికి అండగా ఉంటున్నారు. ఇసుక, మద్యం వంటి కాంట్రాక్టుల్లోనూ ప్రభాకర్ చౌదరి వర్గానికి అన్యాయం జరిగిందని అంటున్నారు. దీంతో రెండు వర్గాలు గత పదమూడు నెలల నుంచి పోరు జరుగుతూనే ఉంది. పోలీసుల వద్దకు కూడా కిడ్నాప్ పంచాయతీ చేరింది. కానీ అధినా యకత్వం జోక్యంతో తాత్కాలికంగా సద్దుమణిగింది. ఇరువురి నేతల మధ్య ఆధిపత్య పోరు అర్బన్ పార్టీ రెండుగా చీలిపోయిందని చెప్పడంలో ఏమాత్రం సందేహం లేదు. కొట్టుకోవడం ఒక్కటే తప్పించి సోషల్ మీడియాలో ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసు కుంటున్నారు. ఇంకా ఎక్కడెక్క దున్నారో? జూనియర్ ఎన్టీఆర్ మూవీపైన... ఇక ఇటీవల స్థల వివాదంలో కూడా ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకున్నారు. గత వారం రోజుల నుంచి సోషల్ మీడియాలో ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేల వర్గాల మధ్య డైలాగ్ వార్ నడుస్తుంది. అయితే తాజాగా జూనియర్ ఎన్టీఆర్ సినిమా కూడా దీనికి తోడయింది. వార్ 2 సినిమా విడుదలయిన సందర్భంగా అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. జూనియర్ ఎన్టీఆర్ ను దూషిస్తూ టీడీపీ యువత కు చెందిన నేత ధనుంజయ్ నాయుడితో మాట్లాడిన తీరును ప్రభాకర్ చౌదరి వర్గీయులు వైరల్ చేశారు. ఇది ప్రత్యర్థుల పనేనంటూ ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ చెబుతున్నారు.

మరొకవైపు జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడించి నిరసన వ్యక్తం చేశారు. మొత్తం మీద తమ్ముళ్ల జోరుతో అనంత పోరు పార్టీకి తలనొప్పిగా మారింది.

# పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

## - జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్



**అనంతపురం– సూర్య వాస్తవం, ఆగస్టు 18 :** అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్) కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ఆయా మండలాల నుంచి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారుల నుండి జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి అర్జీలను స్వీకరించారు.జిల్లా కలెక్టర్ తో పాటు అర్జీలను స్వీకరించే కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, జిల్లా రెవెన్యూ అధికారి ఏ.మలోల, ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి జి.రామకృష్ణారెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రామ్మోహన్, మల్లికార్జునుడు, ఆనంద్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమా మహేశ్వరమ్మ, ఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి 550 అర్జీలను స్వీకరించారు. శిక్షణ అనంతరం తిరిగి జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ వినోద్ కుమార్.వి అంతకుముందు ముస్సోరీలో అధికారుల కోసం నిర్వహించిన మిడ్–కెరీర్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ 23వ రౌండ్ ఫేజ్ 3 శిక్షణలో పాల్గొని.. తిరిగి అనంతపురం జిల్లా కలెక్టర్గా డాక్టర్ వినోద్ కుమార్.బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కు డిఆర్ఓ పూలమొక్క అందజేసి ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ముస్సోరీలో ఐఏఎస్ అధికారుల కోసం నిర్వహించిన మిడ్–కెరీర్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ యొక్క 23వ రౌండ్ ఫేజ్ 3 శిక్షణలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. దేవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి 75 మంది ఐఏఎస్ అధికారులు ఇందులో పాల్గొనడం జరిగిందన్నారు. ఈ సమయంలో ఇంచార్జి జిల్లా కలెక్టర్గా ఉన్న జాయింట్ కలెక్టర్కి కృతజ్ఞతలు తెలియజేశారు. స్వాతంత్ర్య దినోత్సవం




వేడుకలు కూడా బాగా నిర్వహించారన్నారు. ఆయా శాఖల పరిధిలో రాబోయే ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించిన వివరాలను తమకు తెలియజేయాలన్నారు. కంటెంప్ట్ కేసులకు సంబంధించిన ఏదైనా పెండింగ్ ఉంటే తెలపాలన్నారు. పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఆయా శాఖల జిల్లా అధికారులు నాణ్యతగా అర్జీలను పరిష్కరించాలని, ఇందులో ఎలాంటి అలసత్వం ఉండరాదన్నారు. రీఓపెన్ కాకుండా అర్జీలను సకాలంలో, గడువులోగా నాణ్యతగా పరిష్కరించాలన్నారు. అర్జీలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ తిప్పేనాయక్, జడ్పి సిఈఓ శివశంకర్, డీపీఓ నాగరాజు నాయుడు, ఎపిఎస్పిడిసిఎల్ ఎస్ఈ శేషాద్రిశేఖర్, మైన్స్ డిడి ఆదినారాయణ, డ్వామా పిడి సలీమ్ భాష, డిఎంహెచ్ఓ డా.ఈబి.దేవి, జిజిహెచ్ సూపరింటెండెంట్ డా.ఆత్మారావు, జిల్లా సైనిక్ సంక్షేమ శాఖ అధికారి పి.తిమ్మప్ప, హౌసింగ్ పిడి శైలజ, డిసిఓ అరుణకుమారి, డివిఈఓ వెంకటరమణ నాయక్, డిఎండబ్ల్యుఓ రామసుబ్బారెడ్డి, సివిల్ సప్లై డిఎం రమేష్ రెడ్డి, మైనర్ ఇరిగేషన్ ఎస్ఈ విశ్వనాథరెడ్డి, ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఈ సురేష్, ఏపీఎంఐపి పిడి రఘునాథరెడ్డి, బీసీ వెల్ఫేర్ డిడి కుష్బూ కొఠారి, జిల్లా టూరిజం అధికారి జయకుమార్ బాబు, డిటిసి వీర్రాజు, జిల్లా పరిశ్రమల శాఖ జిఎం శ్రీనివాసరావు, కలెక్టరేట్ సెక్షన్ల సూపరింటెండెంట్లు యుగేశ్వరిదేవి, రియాజుద్దీన్, కలెక్టరేట్ ఏవో అలెగ్జాండర్, ఆయా శాఖల జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వర్షాల వేళ ప్రజలంతా అత్యంత అప్రమత్తంగా ఉండాలి

**- జిల్లాలో పలు చోట్ల పిడుగులు పడే అవకాశం**

**- ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడేప్పుడు చెట్లు, టవర్స్, పోల్స్, పొలాలు, బహిరంగ ప్రదేశాల్లో ఎవరూ ఉండరాదు**

**- సురక్షితమైన భవనాల్లో ప్రతి ఒక్కరూ ఆశ్రయం పొందాలి**

**- జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్**



**అనంతపురం కలెక్టరేట్ – సూర్య వాస్తవం, ఆగస్టు 18 :** వర్షాల వేళ ప్రజలంతా అత్యంత అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, సూచించారు. ఏపీ విపత్తుల సంస్థ సూచనల మేరకు జిల్లాలో పలు చోట్ల పిడుగులు పడే అవకాశం ఉందని, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడేప్పుడు చెట్లు, టవర్స్, పోల్స్, పొలాలు, బహిరంగ ప్రదేశాల్లో ఎవరూ ఉండరాదన్నారు. సురక్షితమైన భవనాల్లో ప్రతి ఒక్కరూ ఆశ్రయం పొందాలని, వర్షాల వేళ అందరూ తగిన జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

# సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం




**రాప్తాడు – సూర్య వాస్తవం, ఆగస్టు 18 :** గ్రామాలలోని ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు తమ వంతు కృషి చేస్తామని టీడీపీ మండల కన్వీనర్ పంపు కొండప్ప కార్యదర్శి దగ్గుబాటి శ్రీనివాసులు పేర్కొన్నారు రాప్తాడు మండల పరిధిలోని భోగినేపల్లి గ్రామంలో మీ సమస్య మా బాధ్యత కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ప్రజలు పింఛన్లు భూమి సర్వే కొలతలు బియ్యం కార్డులు తదితర సమస్యలకు సంబంధించిన అర్జీలు ఇచ్చారు.ఈ సమస్యలకు సంబంధిత ప్రభుత్వాధికారులతో మాట్లాడి చర్చించి సమస్యలు పరిష్కరిస్తామని గ్రామ ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ గంగలకుంట క్రిష్ణ బుక్కచెర్ల సింగల్ విండో అధ్యక్షులు బ్రహ్మానందరెడ్డి ఎస్సీ సెల్ అధ్యక్షులు ముత్యాలప్ప క్లస్టర్ ఇంచార్జ్ రాము సోమర నారాయణస్వామి సర్పంచ్ బండి ఉజ్జినప్ప స్టోర్ డీలర్ గంగాధర్ ఫీల్డ్ అసిస్టెంట్ ప్రసాద్ గ్రామ కమిటీ అధ్యక్షులు శివ నారాయణ నాగప్ప మురళి తదితరులు పాల్గొన్నారు.

# యువత అంబేద్కర్ బాటలో నడవాలి



**రాప్తాడు – సూర్య వాస్తవం, ఆగస్టు 18 :** డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం ఎక్కడ చూసినా ఒక గంభీరం కనిపిస్తుంది కానీ ఆ గంభీరం వెనుక ఎంతో విషాదం ఉందని ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు.రామగిరి మండలం గరిమేకలపల్లి గ్రామంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాష్కరణ కార్యక్రమంను పండుగలా నిర్వహించారు.ముఖ్య అతిథులుగా మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ధర్మవరం టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ హాజరయ్యారు.టీడీపీ సీనియర్ నాయకుడు ఎల్.నారాయణ చౌదరి సహకారంతో గ్రామంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. గ్రామస్థులు మహిళలు పెద్ద ఎత్తున బోనాలతో తరలివచ్చి డప్పులు వాయిస్తూ టపాసులు పేలుస్తూ పూల వర్షం కురిపిస్తూ ఊరేగింపుగా వచ్చిన మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ధర్మవరం టిడిపి ఇన్చార్జ్ పరిటాల శ్రీరాములు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ చేశారు. శ్రీరామ్ మాట్లాడుతూ ఎంఎస్ రాజు అనేక పోరాటాలు చేసి ఈ స్థాయికి వచ్చారన్నారు.తాము చేసిన పోరాటాల్లో భాగమయ్యారు. ప్రతి ఒక్కరూ అంబేద్కర్ జీవితాన్ని చదివితే కష్టాలు ఎలా ఉంటాయి.ఉన్నత స్థాయికి ఎలా ఎదగాలన్నది తెలుస్తుందన్నారు.అనేక వివక్షలను అవమానాలను ఎదురు దెబ్బలను తట్టుకుని ఉన్నత చదువులు చదివి దేశంలోనే ఒక మహోన్నత వ్యక్తిగా ఎదిగారు అని తెలియజేశారు. అభివృద్ధి చెందుతున్న ఈ రోజుల్లో ఒక్క డిగ్రీ చేయాలంటే కష్టపడుతు న్నాము కానీ ఆ రోజుల్లోనే అనేక అవరోధాలు ఎదుర్కొని 32 డిగ్రీలు చేశారంటే అంబేద్కర్ శ్రమ ఎంత ఉందో అర్థం చేసుకోవచ్చున్నారు. స్వాతంత్రం వచ్చే నాటికి దేశంలో కుల వివక్ష మత గొడవలు ఉండేవని అలాంటి సమయంలో అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించి, రాసి ఒక మార్గదర్శనం



చేశారన్నారు.ఇప్పుడు ఇది దేశానికే కాకుండా ప్రపంచానికే ఆదర్శంగా మారింది.ఆనాడు దళితులను చెరువులో నీరు కూడా తాగనివ్వకుండా అడ్డుకుంటున్నప్పుడు అంబేద్కర్ మార్పు చూపించారు.అదే స్ఫూర్తితో మా స్వగ్రామమైన వెంకటాపురంలో పరిటాల శ్రీరాములు దళితులకు బావిలో నీరు ఇచ్చి ఆదర్శంగా నిలిచారు. దళితులు మాకు వెన్నంటే ఉండి అండగా నిలిచారని గుర్తు చేసుకున్నారు.మా కుటుంబం ఎదుగుదల పోరాటాల్లో దళితుల పాత్ర ఎంతో ఉందన్నారు. మరోవైపు ఎంఎస్ రాజు మాట్లాడుతూ దళితులు గతంలో చేసిన త్యాగాలు కష్టాల గురించి పరిటాల శ్రీరామ్ గుర్తు పెట్టుకున్నారంటే దానికి దళితులంతా కృతజ్ఞతలు చెబుతున్నాము అని తెలిపారు. రాప్తాడు అభివృద్ధి గురించి చెప్పాలంటే పరిటాల అనే 4 అక్షరాలు లేకుండా చెప్పలేమన్నారు.ఈ నియోజకవర్గ అభివృద్ధి ప్రజల ఎదుగుదల వెనుక పరిటాల కుటుంబం ఉందన్నారు.ఇక్కడ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు సహకరించిన ఎల్.నారాయణ చౌదరికి కృతజ్ఞతలు తెలిపారు. మన దేశంలో ఎవరి మతం వారు ఆ దేవుళ్లకు మొక్కుతారని కానీ దేశం మొత్తం నమస్కరించేది ఒక్క అంబేద్కర్ కి మాత్రమే అని అన్నారు. ఇక్కడ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేశారంటే ప్రజలు చైతన్యం ప్రశ్నించే వాళ్ళు ఉన్నారని అర్థం చేసుకోవాలి.ఈ ప్రాంత ప్రజలకు అంబేద్కర్ విగ్రహం ఒక దిక్సూచిగా ఉంటుందన్నారు.

# వికలాంగుల పింఛన్లపై వైసీపీ దుష్ప్రచారం

**- ఖబడ్దార్ అంటూ తీవ్రంగా స్పందించిన విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల చైర్మన్ గడుపూటి నారాయణ స్వామి**



**పామిడి –సూర్య వాస్తవం, ఆగస్టు 18:** అనంతపురం ఆర్ అండ్ బి అతిథి గృహంలో విలేకరుల సమావేశంలో నాకు విభిన్న ప్రతిభా వంతులు వయోవృద్ధుల సహాయ కార్పొరేషన్ చైర్మన్గా నియమించిన కూటమి ప్రభుత్వం పెద్దలు ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడుకి, ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ కి, యువగల రథసారధి భవిష్యత్ తరాల నాయకుడు నారాలోకేష్కి బీజేపీ పెద్దలకు కృతజ్ఞతలు తెలియజేసి, వైస్సార్సీపీ అల్లరి మూకలు వికలాంగుల పింఛన్ పై దృష్ప్రచారం చేస్తున్నారని గత వైస్సార్సీపీ ప్రభుత్వంలో అనర్హులకు పింఛన్లు ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఖజానాకు గండి కొట్టారని నిజమైన లబ్ధిదారుల నిధులను వైస్సార్సీపీ శ్రేణులు లూటీచేసారని వాటిని గుర్తించి అనర్హులను మాత్రమే కూటమి ప్రభుత్వం తొలగించి ఆ నిధులను కూటమి ప్రభుత్వం విభిన్నప్రతిభావంతుల సంక్షేమంకి పాటుపడుతుంది అని, దృష్ప్రచారాలు చేస్తే వికలాంగులు ఎవరు సహించరని ఖబర్దార్ వైస్సార్సీపీ శ్రేణులారా?అ ంటూ వైస్సార్సీపీ పై మండిపడ్డ చైర్మన్ గడిపూటి నారాయణ స్వామిగారు ఈ కార్యక్రమంలో పార్లమెంట్ అధ్యక్షుడు అప్పన్న గారి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయమే ఆరోగ్యానికి మేలు



**రాప్తాడు –సూర్య వాస్తవం, ఆగస్టు 18:** సహజ సిద్ధంగా ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలతోనే సంపూర్ణ ఆరోగ్యం వస్తుందని ఎంఓఆర్డి అడిషనల్ సెక్రటరీ అనిల్ కుమార్ పేర్కొన్నారు. రాప్తాడు మండల పరిధిలోని జి.కొత్తపల్లి గ్రామం నందు ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులు పండిస్తున్న పంటలను పరిశీలించారు. మీరు ఎన్ని సంవత్సరాల నుండి వ్యవసాయం చేస్తున్నారు అందులోనూ ప్రకృతి వ్యవసాయం ఎన్ని సంవత్సరాల నుంచి చేస్తున్నారు? ఎలా చేస్తున్నారు? పంట ఎలా పండిస్తున్నారు? దిగుబడి ఎంతో వస్తోంది? మార్కెటింగ్ ఎలా చేస్తున్నారు? తదితర వివరాలను రైతులతో అడిగి తెలుసుకున్నారు. రైతులు జి.లక్ష్మి దేవి 18 సెంట్లలో 22 రకాల ఆకుకూరలు కూరగాయలు పండించడం చూశారు. పి.అనిత 4 ఎకరాల పొలంలో డ్రాగన్ ఫ్రూట్ పంటను పరిశీలించారు. లోకేశ్వరి ఎ గ్రేడ్ మోడల్ ద్వారా పండించిన సీతా ఫలం టమోట అలసంద పంటలను పరిశీలించారు. మహిళా సంఘం మరియు రైతు మహిళా సంఘం సభ్యులతో చర్చించారు. విషపూరితమైన మం దులు ఎక్కువగా వాడడం వల్ల నేలు చౌడు బారి పోతు న్నాయి. రోజురోజుకి వ్యవసాయం చేసేవాళ్లు తగ్గిపో తున్నారు. అలాగే వైద్యానికి అందని రోగాలు వచ్చి ప్రజలు చనిపోతున్నారు. అందువలన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తోందన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలు ఆరోగ్యానికి మేలు చేస్తాయని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎన్ ఆర్ ఎల్ ఎం ఏ పి ఇన్చార్జి బీబు సంతోష్ అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రాహర్ అదనపు సీఈఓ సెర్ప్ శ్రీరాములు నాయుడు జీవనోపాధి డైరెక్టర్ శివశంకర్ ప్రాజెక్ట్ డైరెక్టర్ టి.శైలజ డిఆర్డీఏ డిపిఎం లక్ష్మా నాయక్ డిపిఎం ఎల్ హెచ్ బి.గంగాధర్ రాప్తాడు ఎంపీడీఓ జయలక్ష్మి ఏపీఎం సునీత గ్రామ ఇన్చార్జి సోమర నారాయణస్వామి రైతులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# శ్రీమాతాంగి మహాపీఠం ఈ ప్రాంత వాసులకు వరం



**లక్కిరెడ్డిపల్లె – సూర్య వాస్తవం, ఆగస్టు 18:** శ్రీ మాతాంగి మహాపితం ఈ ప్రాంత వాసులకు వరంలాంటిధని ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని రాయచోటి వేంపల్లి మార్గంలోని దొరిచెరువు వద్ద వెలిసిన శ్రీమాతాంగి మహా పీఠంను సందర్శించి మహా నందగిరి స్వామివారి ఆశీస్సులు పొందారు.మహానందగిరి స్వామి ఎంపీపీ సుదర్శన్ రెడ్డిని స్వాగతిస్తూ దుశ్యాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ శ్రీ మాతాంగి మహాపీఠం ఆలయం ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసి భక్తి మార్గంలో నడవడం ఎంతో సంతోషంగా ఉందని ఆయన ఆకాంక్షిం చారు. శ్రీమాతాంగి మహాపీఠం నిర్మాణంకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని మహానందగిరి స్వామి వారికి ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు వెంకటనారాయణ రెడ్డి, కాలాడి జనార్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాయచోటి ఉప విద్యా శాఖాధికారిగా ఎల్.నాగయ్య



**అన్నమయ్య బ్యూరో –సూర్య వాస్తవం, ఆగస్టు 18:** రాయచోటి ఉప విద్యాశాఖ అధికారిగా ఎల్.నాగయ్య సోమవారం బాధ్యతలు చేపట్టారు.రాయచోటి విద్యాశాఖ డివిజన్ అధికారిగా గతంలో ఇక్కడ పనిచేస్తున్న శివప్రకాష్ రెడ్డి పదవి వివరణ పొందడంతో గత కొన్ని నెలలుగా ఆస్థానం ఖాళీగా ఉంది. ఈ మేరకు విద్యాశాఖ ఉత్తర్వులతో అన్నమయ్య జిల్లా పరిధిలోని నందలూరు మండల విద్యాశాఖ అధికారిగా పనిచేస్తున్న ఎల్.నాగయ్య పదోన్నతిపై రాయచోటి ఉప విద్యాశాఖ అధికారిగా (డివైఈఓ)బదిలీపై వచ్చారు. నూతన ఉప విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన ఎల్.నాగయ్యకు నోబెల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కొండూరు శ్రీనివాసరాజు, ఎన్.టి.ఏ.నాయకులు వేణుమాధవరాజు, కొండూరు మురళీ మోహన్‌రాజు,వెంకటసుబ్బయ్య, హరిప్రసాద్, ఉపాధ్యాయులు జగదీశ్వరయ్య, ఇలియాజ్‌లు పుష్పగుచ్ఛం అందజేసి సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నూతన డివైఈఓ నాగయ్య మాట్లాడుతూ రాయచోటి విద్యాశాఖ డివిజన్ పరిధిలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సమస్యలు పరిష్కరించడమే కాకుండా బడి బయట పిల్లలను బడిలో చేర్పించేందుకు కృషి చేస్తానన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు, స్కూల్ కమిటీ సభ్యులతో కలిసి పని చేస్తానన్నారు.

## రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలి

**- అన్నమయ్య జిల్లా కలెక్టర్‌కి వినతి పత్రం" కార్యక్రమం విజయవంతం**
**- బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు యుగంధర్ అబ్బవరం**




**అన్నమయ్య బ్యూరో – సూర్య వాస్తవం, ఆగస్టు 18:** రాష్ట్రవ్యాప్తంగా బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు గౌరవనీయులు బందెల గౌతమ్ కుమార్ ఆదేశాల మేరకు అన్నమయ్య జిల్లా అధ్యక్షులు యుగంధర్ ఆధ్వర్యంలో అన్నమయ్య జిల్లా కలెక్టర్‌కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా లిజిల్లా అధ్యక్షుడు యుగంధర్ అబ్బవరం మాట్లాడుతూబీసీలకు వచ్చే స్థానిక సంస్థ ఎన్నికల్లో 50శాతం శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ.. సోమవారం మెమోరండం ఇవ్వడం జరిగింది. అన్ని రాజకీయ పార్టీలు బీసీలను మోసం చేస్తున్నాయని బీసీలకు రాజ్యాధికారం బహుజన్ సమాజ్ పార్టీ ద్వారానే సాధ్యమని తెలియజేశారు, బీసీల కోసమే ఈ దేశంలో ఈ రాష్ట్రంలో బహుజన్ సమాజ్ పార్టీ పనిచేస్తుందని అందుకే ఈ రాష్ట్రంలో ఉన్న బీసీలందరూ ఏకతాటిపై వచ్చి బహుజన్ సమాజ్ పార్టీని ఆదరించి బెహన్ కుమారి మాయావతిని ప్రధానమంత్రి చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడ్వైజర్ బుసపోగుల ఆంజనేయులు, జిల్లా కార్యదర్శి పెదవీటి నరసింహులు, రాయచోటి అసెంబ్లీ అధ్యక్షులు అబ్బవరం నాగేశ్వర్, మహిళా నాయకులు ప్రియా, రూప బి.ఎస్.పి, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో శ్రీకృష్ణాష్టమి అంగ రంగ వైభవంగా వేడుకలు



**గుత్తి – సూర్య వాస్తవం, ఆగస్టు 18:** గుత్తి మండలంలోని కె ఉబిచర్ల గ్రామంలో శ్రీకృష్ణుని వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. మొదట శ్రీకృష్ణుని విగ్రహానికి అభిషేకం నిర్వహించి ధూప, దీప నైవేద్యాలను అర్పించారు. శ్రీ కృష్ణుని అట పాటలు నృత్యాలతో శ్రీ కృష్ణుని నామాలతో కార్యక్ర మాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

## భార్య కాపురానికి రాలేదని భర్త ఆత్మహత్యాయత్నం



**మదనపల్లె – సూర్య వాస్తవం, ఆగస్టు 18:** భార్య కాపురానికి రాలేదని, భర్త ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన సంఘటన సోమ వారం రామసముద్రం మండలంలో జరిగింది. బాధితుని కుటుంబ సభ్యుల కథనం మేరకు.. కనగానిపల్లె పంచాయతీ, చొక్కాండ్లపల్లికి చెందిన సుబ్రహ్మణ్యం (45) భార్య హేమలత 15 రోజులక్రితం కుటుంబ సమస్యలపై గొడవపడుకున్నారు. దీంతో హేమలత అలిగి పుంగనూరు మండలం, బట్టందొడ్డిలో ఉన్న పుట్టింటికి వెళ్ళిపోయింది. పలుమార్లు కాపురానికి రావాలని పిలిచిన రావకపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురైన సుబ్రహ్మణ్యం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు బాధితున్ని మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉండడంతో ఐసీయూ కు తరలించి చికిత్స అందిస్తున్నారు. రామసముద్రం పోలీసులు విచారణ చేస్తున్నారు.

## ప్రభుత్వం విద్యార్థుల పాలిట శాపంగా ఇచ్చిన జీఓని రద్దు చేయాలి

- కసాపురం వంశీయాదవ్ యాదవ్
- అంబేద్కర్ విగ్రహం ముందు తలకు నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసన
- ప్రభుత్వ విద్యను నీరుగార్చడమే మంత్రి లోకేష్ లక్ష్యం
- పాఠశాలల్లోకి బయట వ్యక్తుల ప్రవేశాన్ని నిషేధించే జీఓ వెనక కుట్ర?
- కూటమి ప్రభుత్వంలో విద్యార్థుల మీద ఎల్లో బుక్ రూల్స్‌ని ఆపాలి
- జైల్లో ఖైదీలను కలిసే అవకాశం ఉంది కానీ పాఠశాల విద్యార్థులను కలిసే అవకాశం రాష్ట్రంలో లేదు
- ఖైదీలకు పెద్దపీట వేసి విద్యార్థుల పైన నీచమైన ప్రేమను చూపిస్తున్న కూటమి సర్కార్







**పామిడి– సూర్య వాస్తవం, ఆగస్టు 18 :** వైఎస్సార్సీపి గుంతకల్లు నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు వెంకటరామి రెడ్డి ఆదేశాల మేరకు గుంతకల్లు పట్టణం బిఆర్ అంబేత్కర్ విగ్రహం దగ్గర నియోజకవర్గం అధ్యక్షులు నరప్ప,గుంతకల్లు పట్టణ, మండల అధ్యక్షులు మణికంఠ, అనిల్ కుమార్ అధ్యక్షతన నిరసన కార్యక్రమం చేయడం జరిగింది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కసాపురం వంశీ యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వం విడుదల చేసిన జీవో ఆర్సి ఎన్ఓ 30/67/2025 తేది (01-08-2025) ని రద్దు చేయాలని నల్ల రిబ్బన్లు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అంబేద్కర్ రచించిన రాజ్యాంగం లేదని రెడ్బుక్ పాలన, ఎల్లో బుక్ ఎడ్యుకేషన్ పాలసీ నడుస్తుందన్నారు. ప్రభుత్వం విద్యార్థుల సమస్యలు బయటకి వస్తాయన్న భయంతోనే ప్రభుత్వ పాఠశాల్లోకి ఎవ్వరూ వెళ్ళకూడదనే జీవోని రిలీజ్ చేసిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అద్భుతంగా పరి పాలిస్తే విద్యార్థులని విద్యార్థి నాయకులు గానీ, ప్రజా సంఘాల నాయకులు గాని కలవకూడదన్న జీవోని ఎందుకు తెచ్చారని ప్రశ్నించారు. ప్రభుత్వ విద్యను నీరుగార్చడమే మంత్రి నారా లోకేష్ లక్ష్యమని దుయ్య బట్టారు. రాష్ట్రములో జైలులో ఉన్న ఖైదీలను కలవడానికి వెసులుబాటు ఉన్నది గానీ చదువుకునే విద్యార్థులు కలవడానికి అవకాశం లేకుండా చేసిన ఘనత దేశ వ్యాప్తంగా ఒక్క ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకే దక్కుతుందని మండిపడ్డారు. ఎల్లో బుక్ రూల్స్ తో విద్యా వ్యవస్థ పూర్తిగా గాడి తప్పిందన్నారు. తక్షణమే జీవోని రద్దు చేయాలని గతంలో జనసేన అధినేతగా పవన్ కళ్యాణ్ స్కూల్ కి వెళ్ళిన సందర్భాన్ని మరిచిపోయారని తెలిపారు. ప్రస్తుతం జీవో మీద మాట్లాడకుండా మౌన దీక్ష ఎందుకు చేస్తున్నారని విద్యార్థుల పక్ష పాతిగా పవన్ కళ్యాణ్ ప్రశ్నించాలని కూటమి ప్రభుత్వంపై మండిపడ్డారు. గుంతకల్లు నియోజకవర్గం విద్యార్థి విభాగం అధ్యక్షులు నక్క నరప్ప మాట్లాడుతు హాస్టల్లో సందర్శన కార్యక్రమం చేపట్టినప్పుడు విద్యార్థుల సమస్యలు బయటకి వచ్చాయన్నారు. ఇంకా అనేక సమస్యలు బయటికి వస్తాయనే కూటమి ప్రభుత్వం భయపడి జీవోని రిలీజ్ చేసిందన్నారు. ప్రభుత్వ విద్యావిధానం అభివృద్ధి లక్ష్యంగా పనిచేయాలి కానీ కార్పొరేట్ విద్యాసంస్థల అభివృద్ధి లక్ష్యంగా మంత్రి నారా లోకేష్ పని చేస్తున్నారని విమర్శించారు. సంవత్సర కాలంలో విద్యావ్యవస్థ పూర్తిగా నాశనం అయిపోయిందన్నారు. రెడ్బుక్ మీద పెట్టిన దృష్టి పిల్లల బుక్కులు మీద పెట్టలేదన్నారు. తక్షణమే జీవోని రద్దు చేయాలని కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గుంతకల్ పట్టణ మండల అధ్యక్షులు మణికంఠ, అనిల్ కుమార్, నియోజకవర్గం అధ్యక్షులు పవన్‌కుమార్, పట్టణ అధ్యక్షులు విష్ణుసాయి యాదవ్, విద్యార్థి విభాగం నాయకులు జయ రెడ్డి, శివ, అభి, అశోక్, మధు, అజయ్, గణేష్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ చూపిన ఆధారాలకు ఈసీఐ సమాధానం చెప్పాలి

**- కదిరి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి కేఎస్ షానవాజ్**



**కదిరి– సూర్య వాస్తవం, ఆగస్టు18:** లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైయస్ షర్మిల రెడ్డి ఆదేశాల మేరకు కదిరి పట్టణంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి అంబేద్కర్ సర్కిల్ వరకు నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో కదిరి నియోజవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కేఎస్ షానవాజ్ , పుట్టపర్తి నియోజకవర్గ ఇన్చార్జ్ దాదిరెడ్డి మధు సూదన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొని ఓటు దొంగ గద్దె దిగు అని నినాదాలు చేసుకుంటూ అంబేద్కర్ సర్కిల్ కు చేరుకున్నారు. ఈ సందర్భంగా షానవాజ్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ చేపట్టిన ఓట్ చోరీ కార్యక్రమం చాలా గొప్ప కార్యక్రమనీ భారత దేశ ప్రజలందరూ స్వాగతిస్తున్నారని రాజ్యాంగం ప్రకారం ప్రతి ఒక్క మనిషికి ఒక ఓటు మాత్రమే ఉండాల న్నారు. కానీ ప్రస్తుతము ఉన్న కేంద్ర ఎన్నికల కమిషన్ బీజేపీ ప్రభుత్వానికి తొత్తులా మారి ఓట్లను చోరీ చేస్తూ నరేంద్ర మోడీ ని ప్రధానమంత్రిని చేసిందని ఓట్లు చోరీ చేసి ప్రధానమంత్రి అయినటువంటి నరేంద్ర మోడీ వెంటనే గద్దె దిగాలని యావత్ దేశ ప్రజలందరూ డిమాండ్ చేస్తున్నారని అన్నారు. అదేవిధంగా బ్రతికి ఉన్నటువంటి ప్రజలు చనిపోయారని వారి ఓట్లను తొలగించడం, ఒకే వ్యక్తికి సంబంధించిన నాలుగైదు ఓట్లను నమోదు చేయడం, ఒకే ఇంటిలో 80 ఓట్లు చేర్చడం అదేవిధంగా బీహార్లో దాదాపు 65 లక్షల మంది ఓటర్లను తీసివేసి దొంగ ఓట్లను ఎక్కించి ప్రజలు ఓటు వేసుకునే హక్కును నిర్వీర్యం చేస్తూ వ్యవస్థను కూని చేస్తున్నారని వీటిని అన్నిటిని వ్యతిరేకిస్తూ లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆధారాలతో సహా దేశ ప్రజల ముందు పెట్టిన ఎలక్షన్ కమిషన్ రాహుల్ గాంధీ అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా మేము ఎవరికి భయపడేది లేదని చెప్పడం హాస్యాస్పదంగా ఉన్నారు రాహుల్ గాంధీ ఆధారాలు ఇవ్వాలని అఫీడవిట్ ఇవ్వాలని చెప్తూ భారతీయ జనతా పార్టీకి సంబంధించిన నాయకుడిలాగా ఎన్నికల ప్రధాన అధికారి గ్యాణేష్ కుమార్ గుప్తా ప్రవర్తించడం దేశ ప్రజల యొక్క అనుమానాన్ని మరింత బలోపేతం చేస్తోందన్నారు. ఈ యొక్క ఓటు చోరీనీ అడ్డుకోవాలని రాహుల్ గాంధీ ఒక మహా ఉద్యమం చేపట్టారని. దానికి అందరూ మద్దతు ఇచ్చి తమ ఓటు హక్కును కాపాడుకోవాలని కోరారు ప్రజలందరికీ న్యాయం జరగాలంటే ఒక కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని రాష్ట్రంలో కూడా కాంగ్రెస్ పార్టీ అధికా రంలోకి వస్తుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కదిరి పట్టణ అధ్యక్షుడు అల్లాబకష్, మైనార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జైనుల, డిసిసి ఉపా ధ్యక్షుడు మేదర నాగభూషణం, నల్లమడ అధ్యక్షుడు గౌస్, అమడగురు అధ్యక్షుడు సురేంద్ర, ఒడిసి అధ్యక్షుడు సురేష్, పుట్టపర్తి అధ్యక్షుడు చంద్రకాంత్ నల్లచెరువు మండల అధ్యక్షుడు బాబు, జాబీఉల్ల, ఎన్ఎస్‌యుఐ పట్టణ అధ్యక్షుడు సుహేల్, అమ్మజాన్ కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## అంగరంగ వైభవంగా శ్రీకృష్ణుడి ఊరేగింపు

**ఫ్యాపిలి – సూర్య వాస్తవం, ఆగస్టు 18:** మండల పరిధిలోని హుసేనాపురం గ్రామంలో సోమవారంతో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ముగిశాయి. ముందుగా శ్రీ శ్రీ ఆచార్య ప్రభోధనంద యోగేశ్వరులు ఆశీస్సులతో, త్రైత్ర సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందు జ్ఞాన వేదిక హుసేనాపురం కమిటీ ఆధ్వర్యంలో ఇందు జ్ఞాన వేదిక కమిటీ హుసేనాపురం కమిటీ అధ్యక్షులు శివ ప్రసాద్, కమిటీ సభ్యులు సుధాకర్ నాయుడు, మలి ్లకార్జున, మధు, గోపాల్, పరమేష్ ఆధ్వర్యంలో గ్రామంలో శ్రీకృష్ణ భగవానుడు ఊరేగింపు అంగరంగ వైభవంగా నిర్వ హించారు. ఊరేగింపులో కోలాటలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను అలరి ంచాయి. ఈ సందర్భంగా అధ్యక్షులు శివప్రసాద్ మాట్లాడుతూ.... దేవుడే మనిషిగా జన్మించి మనిషిగా అవతరిస్తే ఆయనను భగవంతుడు అంటాం అలాంటి భగవంతుడే శ్రీకృష్ణుడని ఆయనను మాత్రమే అందరూ దైవంగా గుర్తించాలని కృష్ణుడు పౌర్ణమి అమావాస్యలకి మధ్య అష్టమి తిధిలో పుట్టి జ్ఞాన అజ్ఞానములకు వారధిగా ఉన్నాడని గ్రామ ప్రజలందరికీ తెలియజేయడానికే ఈ ఊరేగింపును ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.



## విద్యార్థి సంఘాల ప్రవేశంపై

# జారీ చేసిన ఉత్తర్వుల్ని ఉపసంహరించుకోవాలి

- అంబేద్కర్ సర్కిల్ వద్ద నిరసనలు వ్యక్తం చేసిన విద్యార్థి సంఘాలు
- విద్యార్థి సంఘాలపై ప్రభుత్వం చీకట జీవోలు ఇవ్వడం దారుణం
- వైసీపీ నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షులు,గుమ్మల్ల సాయికుమార్ రెడ్డి డిమాండ్




**చెన్నూరు –సూర్య వాస్తవం, ఆగస్టు 18:** విద్యార్థి సంఘాలపై ప్రభుత్వం జారీ చేసిన చీకటి జీవోలు ఉపసంహరించుకోవాలని విద్యార్థుల భవిష్యత్తుకు పూర్తి భరోసా కల్పించాలని, వారికి ప్రభుత్వ హాస్టల్ల ల్లో మంచి వసతులు కల్పించాలని అక్కడ జరుగుతున్న చిన్న చిన్న తప్పులను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడమే విద్యార్థి సంఘాల ముఖ్య ఉద్దేశమని అందుచేతనే వైఎస్ఆర్సిపి విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని సాంఘిక సంక్షేమ వసతి గృహాలను తనిఖీ చేసి అక్కడి లోపాలను ఎలక్ట్రానిక్ మీడియా, ప్రింట్ మీడియా ద్వారా, ప్రభుత్వానికి చేరవేయడమే దీని ఉద్దేశమని అంతే తప్ప ఎవర్ని వ్యక్తిగతంగా ఉద్దేశించినవి కాదని అలాంటిది విద్యార్థి సంఘాలు విద్యార్థుల వద్దకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకోవడం తప్పా! దీనికే ప్రభుత్వానికి ఉలిక్కి పాటుఎందుకని వైఎస్ ఆర్ సి పి నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షులు గుమ్మల్ల సాయికుమార్ రెడ్డి అన్నారు. ఈ చీకటి జీవోల విషయమై కడప ఆర్టిసి బస్టాండ్ లోని వద్ద గల అంబేద్కర్ విగ్రహం వద్ద విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో సోమవారం నిరసనలు వ్యక్తం చేసినట్లు ఆయన తెలిపారు. విద్యార్థుల సమస్యలపై ఆయన చెన్నూరులో విలేకరులతో మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన పదిహేను నెలల్లోనే విద్యారంగాన్ని పూర్తిగా భ్రష్ట పట్టించిందని తెలిపారు. ప్రభుత్వ వైఫల్యాలు బహిర్గతం అవుతాయనే భయంతోనే విద్యార్థి సంఘాలని ప్రభుత్వ విద్యాసంస్థల్లోకి రాకుండా చీకటి ఉత్తర్వులిచ్చిందని మండిపడ్డారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విద్యార్థి సంఘాలతో సమా వేశాలు నిర్వహించిన విద్యాశాఖ మంత్రి లోకేష్ నేడు ఇలాంటి ఉత్తర్వులివ్వడం ఏంటని ఆయన మండిపడ్డారు. పాఠశాలల్లో విద్యార్థుల కిచ్చిన బ్యాగులు నెల రోజుల్లోనే చిరిగిపోగా మధ్యాహ్న భోజనం అత్యంత నాసిరకంగా ఉన్నది ఆంగ్ల బోధన అటకెక్కిందని సర్దుబాటు పేరుతో ఉపాధ్యాయుల్ని కుదించి పాఠశాలల్ని రద్దు చేసిన ఘనత ఈ కూటమి ప్రభుత్వాన్ని దని ఆయన ఎద్దేవ చేశారు. నాడు, నేడు రద్దు చేసి పాఠశాలల్ని నిర్వీర్యం చేసి ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో కనీస వసతుల్ని కల్పించ పోవడం దారుణమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సమస్యలన్నీ విద్యార్థి సంఘాల దృష్టికి వస్తాయనే లోకేష్ ఇలాంటి ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని ఆయన ప్రభుత్వం తీరును విమర్శించడం జరిగింది. విద్యార్థుల సమస్యల్ని ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చి వాటి సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటాలు చేసేది విద్యార్థి సంఘాలే అన్నారు.

మెగా పేరెంట్, టీచర్ మీటింగ్ లని రాజకీయ కార్యక్రమాలుగా మార్చింది చంద్రబాబు, లోకేష్ లే అని తీవ్రంగా వారు కూటమి ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. రాష్ట్రంలోని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో కలుషితాహారం వల్ల విద్యార్థులు ఆసుపత్రుల పాలవుతున్నారని ఈ విషయాలను సమగ్రంగా అధ్యయనం చేసి ప్రభుత్వానికి తెలియచేస్తామనే ప్రభుత్వం విద్యార్థి సంఘాలపై కఠిన ఆంక్షలు విధించడం జరుగుతుందని ఆయన తెలిపారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో లోకేష్ విద్యార్థి సంఘాలతో మా విషయాలు ముఖాముఖిలు నిర్వహించడం జరిగిందన్నారు. అప్పటికే వైయస్ జగన్మోహన్ రెడ్డి విద్యార్థులకు ఏమేమి చేయాలో అవన్నీ కూడా ఆలోచించి ఆచరణలో పెట్టడమే కాకుండా విద్యారంగానికి ఆయన విశేష కృషి చేయడం జరిగిందన్నారు. అప్పట్లో లోకేష్ విద్యార్థులకు, నిరుద్యోగులకు ఎన్నో హామీలు ఇచ్చి ఇప్పుడు ఆ హామీలను తుంగలో తొక్కి ప్రశ్నించే వారిని ప్రశ్నించకుండా జీవోలు తీసుకురావడంలో అంతర్యమేమిటని ఆయన ప్రభుత్వ తీరును నిలదీశారు. ప్రభుత్వంలో ఉండే ఒక రకంగా, ప్రభుత్వంలో లేకుంటే ఇంకో రకంగా మాట్లాడడం సరికాదన్నారు. గత జగన్ హయాంలో సంక్షేమ కార్యక్రమాల గురించి విద్యార్థి నేతలు విద్యార్థులతో మాట్లాడే స్వేచ్ఛ ఉండేదని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేసారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఇటువంటి అప్రజాస్వామికమైన ఉత్తర్వులు ఐదేళ్లలో సీఎం గా ఉన్న జగన్ మోహన్ రెడ్డి ఇవ్వలేదని తెలిపారు. డా. బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగం ద్వారా కల్పించిన ప్రజాస్వామిక హక్కుల్ని లోకేష్ కాలరాస్తున్నారని తెలిపారు.

విద్యాసంస్థల్లోకి విద్యార్థి సంఘాలు రాకూడదంటూ పాఠశాల విద్యా శాఖ, ఇంటర్మీడియట్ బోర్డు జారీ చేసిన ఉత్తర్వుల్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షులు వెంకటేష్, వైయస్సార్ టి యు సి జిల్లా అధ్యక్షులు మల్లూరి జాషువా, కడప నగర ఎస్సీ విభాగం అధ్యక్షులు కంచుపాటి బాబు , రాష్ట్ర కార్యదర్శి సందీప్ రెడ్డి, జిల్లా విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి శ్యామ్ ,విద్యార్థి విభాగం కడప నగర ఉపాఅధ్యక్షులు జబ్బార్, విద్యార్థి విభాగం నాయకులు విష్ణు,హేమంత్,అనిల్,ప్రవీణ్, సునీల్ , ఎస్సీ విభాగం నాయకులు సంపత్,బుజ్జి, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

# అమరావతి నిర్మాణంలో మరో దేశం



**విజయవాడ–సూర్య వాస్తవం:** అమరావతి రాజధాని నిర్మాణ విషయంలో ఏపీ ప్రభుత్వం దూకుడు మీద ఉంది. 2028 నాటికి రాజధానికి ఒక రూపం తేవాలని భావిస్తోంది కూటమి ప్రభుత్వం. అందుకు అనుగుణంగా అడుగులు వేస్తోంది. ప్రధాని నరేంద్ర మోడీ అమరావతి రాజధాని పునర్నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ పనుల్లో వేగం పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. నిర్ణీత గడువులోక ప్రధాన భవన సముదాయాలను అందు బాటులోకి తీసుకురావాలని భావిస్తోంది. రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులతో పాటు అమరావతి రాజధాని నిర్మాణంలో పాలుపంచుకోవాలని కోరుతూ.. ఆ మధ్య సీఎం చంద్రబాబు, ఇతర మంత్రులు సింగపూర్ పర్యటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అమరావతి రాజధాని నిర్మాణంలో భాగస్వామ్యం అయ్యేందుకు ఓ దేశం ముందుకు వచ్చింది. ఐదు రోజుల పర్యటన నిమిత్తం సీఎం చంద్రబాబు బృందం సింగపూర్ వెళ్లిన సంగతి తెలిసిందే. ఆ దేశమంత్రులతో సైతం సీఎం చంద్రబాబు సమావేశం అయ్యారు. మంత్రి టాన్ సి లంగ్ తో చంద్రబాబు స్వయంగా భేటీ అయ్యారు. అమరావతి నిర్మాణంలో భాగం కావాలని కోరారు. దీనికి ఆయన అంగీకరించలేదంటూ వార్తలు వచ్చాయి. అయితే ఇప్పుడు అనూహ్యంగా మరో దేశం అమరావతి రాజధాని నిర్మాణంలో భాగస్వామ్యం అయ్యేందుకు ముందుకు వచ్చినట్లు తెలుస్తోంది. సింగపూర్ కు బదులుగా వియత్నం ఆసక్తి చూపుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. అమరావతిలో రెండు వేల ఎకరాల్లో స్టార్టప్ ఏరియాను అభివృద్ధి చేసేందుకు వియత్నం ముందుకు వచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. నవ నగరాల్లో అమరావతిని నిర్మించాలన్నది చంద్రబాబు ప్రణాళిక. అందులో భాగంగా స్టార్టప్ ఏరియాను(ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు చంద్రబాబు. దానిని అభివృద్ధి చేయడం ద్వారా అమరావతికి ఒక తుది రూపం తీసుకురావాలని భావిస్తున్నారు. గతంలో ఆ బాధ్యతను సింగపూర్ కు అప్పగించారు. అయితే 2019లో ప్రభుత్వం మారడం.. వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం మూడు రాజధానుల వైపు మొగ్గు చూపిన నేపథ్యంలో దానికి బ్రేక్ పడింది. అప్పట్లో సింగపూర్, సి ఆర్ డి ఏ మధ్య 1679 ఎకరాల స్టార్టప్ ఏరియా అభివృద్ధికి ఒప్పందం కుదిరింది. అయితే వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం సింగపూర్ ప్రతినిధులను దారుణంగా అవమానించింది. రకరకాలుగా అమరావతిపై విషం చిమ్మింది. ఇప్పుడు కూడా చంద్రబాబు బృందం సింగపూర్ పర్యటన నేపథ్యంలో విపరీతమైన మెయిల్స్ పెట్టినట్లు వార్తలు వచ్చాయి. ఇటువంటి తరుణంలో వియత్నం ప్రభుత్వం రాజధాని నిర్మాణంలో పాలు పంచుకునేందుకు ముందుకు వచ్చినట్లు తెలుస్తోంది. దీనిపై క్లారిటీ రావాల్సి ఉంది.

## ఇంకా డోలీ కష్టాలే...

**విశాఖపట్టణం–సూర్య వాస్తవం:** పాలకులు మారినా గిరిజనుల తలరాతలు మారడం లేదు. డోలీ కష్టాలు తప్పడం లేదు. అనేక గ్రామాలకు నేటికీ రహదారి సౌకర్యాన్ని కల్పించకపోవడంతో గిరిజన ప్రజలు అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం ఎన్ని ప్రకటనలు చేసినా అవి అమలులోకి రావడం లేదు. అలాగే ఎన్నికలకు ముందు రాజకీయ పార్టీలు ఇచ్చిన హామీలు సయితం ఆచరణకు నోచుకోవడం లేదు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో గర్భిణుల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. చివరకు ఏ మాత్రం చిన్నపాటి జ్వరం వచ్చినా సరే వారు ఆసుపత్రికి రావాలంటే అష్టకష్టాలు పడాల్సిందే. అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయలో గర్భిణిల డోలీమోత కొనసాగుతూనే ఉంది. అల్లూరి సీతా రామరాజు మండలంలోని మారుమూ ల గ్రామాలకు చెందిన గిరిజనులు రహదారి సౌకర్యం లేక గర్భిణిలను ఆసుపత్రికి తీసుకెళ్లాలంటే వాగులు వంకలు దాటాలి ప్రాణాల ను సైతం పణంగా పెట్టాల్సిన అవసరం ఏర్పడింది. కొన్ని సందర్భాల్లో గర్భిణులు సమయానికి ఆస్పత్రికి చేరుకోక ప్రాణాలు కూడా కోల్పోయిన ఘటనలు అనేకం ఉన్నాయి. ఇటీవల గర్భిణి మహిళ పడిన కష్టాలు చెప్పలేని పరిస్థితి. చింతలపాలెం గ్రామానికి చెందిన కొర్రా జానకి నిండు గర్భిణి కావడంతో ఆమెకు పురిటి నొప్పులు అధికమయ్యా యి. దీంతో ప్రసవానికి పెద్దాసుపత్రికి తీసుకెళ్లాలని భావించారు. కానీ చింతలపాలెం గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవ డంతో వాహనం వచ్చే పరిస్థితి లేదు. దీంతో, కుటుంబ సభ్యులు ఆమెను డోలీలో ఆస్పత్రికి తరలిం చేందుకు సిద్ధమయ్యారు. చింతలపాలెం నుంచి సుమారు కిలోమీటరు మేర డోలీపై తీసుకువచ్చారు. బూసిపుట్టు సమీపంలోకి వచ్చేసరికి పూర్తిగా దారి లేకపోవడం, వర్షాలకు కొండవాలును ఆనుకుని వరద నీరు ప్రవహించడం తో సుమారు కిలోమీటరు మేర నిండు గర్భిణిని నడిపించాల్సి వచ్చింది. అక్కడ నుంచి కొండిభకోట వరకు నాలుగు కిలోమీటర్లు డోలీలో మోసుకువచ్చి ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డను అతి కష్టం మీద దాటించారు. అక్కడ నుంచి కొంతదూరం మోసుకు వచ్చి రేగుళ్లపాలెం మెయిన్‌రోడ్డు నుంచి ఫీడర్ అంబులెన్స్ ద్వారా ఆమెను ఆస్పత్రికి తరలించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పలు మండలాలలో ని గ్రామాలకు సరైన రోడ్డు సౌకర్యం లేక అష్టకష్టాలు పడుతున్నామని, ఇప్పటి కైనా పలు గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రధానంగా తమ గోడును వింటున్న అటవీ శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కు వారు మొరపెట్టుకుంటున్నారు. తమ బాధలను గుర్తించి తమకు డోలీ బాధల నుంచి తప్పించాలని వారు కోరుతున్నారు.

## అనంతలో ఏం జరుగుతోంది



**అనంతపురం–సూర్య వాస్తవం:** ప్రముఖ తెలుగు నటుడు జూనియర్ ఎన్టీఆర్ పై అనంతపురం అర్బన్ టిడిపి ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ బూతులు తిట్టినట్టు ఒక ఆడియో ఉదయం నుంచి వైరల్ అవుతున్నది.. జూనియర్ ఎన్టీఆర్ పై వెంకటేశ్వర ప్రసాద్ అనుచితంగా వ్యాఖ్యలు చేయడం రాజకీయ వర్గాల్లో, సినీ వర్గాల్లో సంచలనం కలిగించాయి. వెంకటేశ్వర ప్రసాద్ ఆ స్థాయిలో వ్యాఖ్యలు చేయడం వెనుక ఎవరైనా ఉన్నారా అనే చర్చ కూడా మొదలైంది. వాస్తవానికి జూనియర్ ఎన్టీఆర్ కు, వెంకటేశ్వర ప్రసాద్ కు ఎటువంటి వివాదాలు లేవు. అయినప్పటికీ ఆయన జూనియర్ ఎన్టీఆర్ ను ఉద్దేశించి ఆ వ్యాఖ్యలు ఎలా చేశారంటూ అభిమానులు మండిపడుతున్నారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఆడియో ప్రకారం.. వెంకటేశ్వర ప్రసాద్ జూనియర్ ఎన్టీఆర్ పై అసభ్యమైన పదజాలం ఉపయోగించారు. ఆయన సినిమాలను ఆడ నిచ్చేది లేదని హెచ్చరించారు. బాబు కుమారుడికి హరికృష్ణ కుమారుడు వ్యతిరేకంగా ఉన్నారని.. అందువల్లే ఆయన చిత్రాలను బహిష్కరించాల్సి ఉంటుందని వెంకటేశ్వర ప్రసాద్ స్పష్టం చేశారు వార్ 2 సినిమా ప్రదర్శనను అనంతపురంలో నిలిపివేస్తామని హెచ్చరించారు.. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో సంచలనంగా మారాయి. వీటిని ఎన్టీఆర్ అభిమానులు తీవ్రంగా పరిగణిస్తున్నారు. అనంతపురం కు చెందిన ధనుంజయ నాయుడుతో మాట్లాడుతూ వెంకటేశ్వర ప్రసాద్ ఈ వ్యాఖ్యలు చేసినట్టు తెలుస్తోంది. సినిమా ప్రదర్శనకు ధనుంజయ నాయుడు వెంకటేశ్వర ప్రసాద్ ను ఆహ్వానించినప్పటికీ ఆయన రాలేదు. పైగా మరిత ఆగ్రహంతో జూనియర్ ఎన్టీఆర్ పై దూషణలు చేశారని తెలుస్తోంది. ఎమ్మెల్యే మాట్లాడిన ఈ ఆడియో సంభాషణ ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వెంకటేశ్వర ప్రసాద్ బూతులు మాట్లాడటం.. దారుణంగా దూషించడం.. అసభ్య పదజాలాన్ని ఉపయోగించడం ఆడియోలో రికార్డు అయింది. ఇది సోషల్ మీడియాలో వైరల్ కావడంతో సంచలనం సృష్టిస్తోంది. వెంకటేశ్వర ప్రసాద్ తన అభిమాన కథానాయకుడి మీద అడ్డగోలుగా మాటలు మాట్లాడిన నేపథ్యంలో జూనియర్ అభిమానులు ఆందోళనకు దిగారు. వెంకటేశ్వర ప్రసాద్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. వెంకటేశ్వర ప్రసాద్ నివాసం ఎదుట ఆందోళన చేయడంతో.. పోలీసులు పరిస్థితి అదుపు తప్పకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆ తర్వాత ఎమ్మెల్యే వెంకటేశ్వర ప్రసాద్ ఈ వివాదంపై స్పందించారు. తాను జూనియర్ ఎన్టీఆర్ ను ఉద్దేశించి విమర్శలు చేయలేదని.. తనకు సీనియర్ ఎన్టీఆర్ అంటే చాలా ఇష్టమని.. జూనియర్ ఎన్టీఆర్ అంటే కూడా వల్లమాలిన అభిమానమని.. అంతేతప్ప తనకు ఎటువంటి ఉద్దేశాలు లేవని వెంకటేశ్వర ప్రసాద్ వ్యాఖ్యానించారు.



# 'మీకు ఏ సమస్య ఉన్నా నా దగ్గరకు రండి'.. ఫెడరేషన్‌తో చిరంజీవి

హైదరాబాద్ : 'మీకు ఏ సమస్య ఉన్నా నా దగ్గరకు రండి' అని చిరంజీవి తమకు భరోసా ఇచ్చారని ఫెడరేషన్ అధ్యక్షుడు అనిల్ తెలిపారు. సినీ కార్మికుల సమ్మె నేపథ్యంలో చిరంజీవి ఫెడరేషన్ సభ్యులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ప్రతి యూనియన్‌తో విడివిడిగా మాట్లాడుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చిరంజీవితో సమావేశం అనంతరం ఫెడరేషన్ అధ్యక్షుడు అనిల్ మీడియాతో మాట్లాడుతూ, కార్మికుల వేతనాలు పెంచాలని కోరుతూ తాము 15 రోజులుగా సమ్మె చేస్తున్నామని తెలిపారు. ఈరోజు చిరంజీవి తమను పిలిచి మాట్లాడారని వెల్లడించారు. 24 విభాగాల నుంచి 72 మందితో ఆయన చర్చించారని తెలిపారు. నిర్మాతలు తాము చెప్పేది వినకుండా తమ మీదే నిందలు వేస్తున్నారని ఆయన దృష్టికి తీసుకు వెళ్లామని ఆయన తెలిపారు. సాధ్యం కాని, అమలు చేయలేని నిబంధనలు పెడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులతో పాటు నిర్మాతలు కూడా బాగుండాలని, కానీ నిర్మాతలు పెట్టిన రెండు షరతులకు తాము ఒప్పుకుంటే నష్టపోతామని అనిల్ అన్నారు. ఈ విషయాన్ని చిరంజీవి దృష్టికి తీసుకువెళ్లినట్లు చెప్పారు.

'మీకు ఏ సమస్య ఉన్నా నా దగ్గరకు రండి' అని చిరంజీవి తమకు భరోసా ఇచ్చారని ఆయన తెలిపారు. మంగళవారం జనరల్ బాడీ మీటింగ్ ఏర్పాటు చేస్తామని, ఛాంబర్ నుంచి కూడా తమకు పిలుపు వచ్చిందని అన్నారు. చర్చలకు పిలిచారు కాబట్టి తాము ప్రస్తుతానికి నిరసన కార్యక్రమం ఆపేశామని తెలిపారు. తాము అడిగినట్లు వేతనాలు వస్తాయని భావిస్తున్నామని అన్నారు.

## ఎంపికలతోనే
# కియరాకు ఇలాంటి చిక్కులు!



కెరీర్ లో నటించినవన్నీ భారీ క్రేజ్ ఉన్న సినిమాలే. ప్రతిసారీ అగ్రహీరోల సరసన అవకాశాలొచ్చాయి. కానీ ఈ భామకు సరైన బ్లాక్ బస్టర్ పడటం చాలా కష్టమే అవుతోంది. ఇటీవల అరడజను ఫ్లాపుల తర్వాత వార్ 2 రూపంలో అయినా సక్సెస్ చేతికి అందుతుందని భావించింది. కానీ మొదటిరోజు నిరాశపరిచే రివ్యూలతో అది కూడా ఆవిరైపోయింది. వార్ 2 మొదటి వీకెండ్ నాటికి కేవలం 200 కోట్లు వసూలు చేసింది. సోమవారం నుంచి టికెట్ విండో వద్ద ఊపు తగ్గిపోయిందని ట్రేడ్ విశ్లేషిస్తోంది. రామ్ చరణ్ సరసన శంకర్ దర్శకత్వంలో నటించిన గేమ్ ఛేంజర్‌భారీ హైప్ నడుమ విడుదలై ఘోరమైన డిజాస్టర్ గా మారింది. ఇది నిజానికి చరణ్, శంకర్ లతో పాటు కియరాను కూడా తీవ్రంగా నిరాశపరిచింది. అప్పటికి దేవరలో అవకాశం వచ్చినా కానీ గేమ్ ఛేంజర్ కోసం ఆ అవకాశాన్ని వదులుకుందన్న టాక్ కూడా ఉంది. జగ్ జగ్ జియో, గోవిందా నామ్ తేరా, సత్య ప్రేమ్ కి కథ వంటి సినిమాలు కూడా ఆశించినంత బ్లాక్ బస్టర్లు కాలేదు. దీంతో చాలా కాలంగా కియరా నిరాశలోనే ఉంది. ఇప్పుడు చాలా హోప్స్ పెట్టుకుని ఎదురు చూసిన వార్2చిత్రంపై సమీక్షకులు విరుచుకుపడటంతో తన ఎంపికల విషయంలో ఆలోచించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. హృతిక్, ఎన్టీఆర్ లాంటి అగ్ర హీరోల సరసన అవకాశం వచ్చినా, తన పాత్రలో అంతో ఇంతో విషయం ఉన్నా కానీ, స్క్రిప్టులో మ్యాటర్ లేకపోతే ఓవరాల్ గా ఫలితం ఎలా ఉంటుందో కియరాకు కాబట్టి భవిష్యత్ లో స్క్రిప్టులో ప్రత్యేకతను కూడా గెస్ చేయడం నేర్చుకోవాల్సి ఉంది. ఇప్పటి ఈ రియలైజేషన్ నెక్ట్స్ ఎంపికపై ప్రభావం చూపుతుందేమో చూడాలి. పెద్ద స్టార్లు, పెద్ద స్టార్ డైరెక్టర్, బడా నిర్మాతలు మాత్రమే తనకు గొప్ప విజయాన్ని ఇవ్వలేరు. ఇప్పుడు కియరా కూడా ఒక నిత్యా మీనన్ లా, సాయిపల్లవిలా కిందికి దిగి వచ్చి ఆలోచించగలగాలి. ఆదుకునేది ఇదొక్కటే... ఈ క్లిష్ట సమయంలో కియరాను ఆదుకునేది టాక్సిక్ ఒక్కటే. కేజీఎఫ్ యష్ లాంటి ట్యాలెంటెడ్ హీరో సరసన కియరాకు అరుదైన అవకాశమిది.. గీతూ మోహన్ దాస్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం రకరకాల కారణాలతో విడుదల అంతకంతకు ఆలస్యమవుతోంది. గేమ్ ఛేంజర్, వార్ 2 రేంజులో పాన్ ఇండియాలో విడుదలయ్యే మరో చిత్రం కావడంతో కియరా హోప్స్ అన్నీ ఈ సినిమాపైనే.



## నేడు ఆసియా కప్‌కు
# జట్టు ప్రకటించనున్న బిసిసిఐ?



ముంబయి: ఆసియా కప్ 2025కు ఒక్కో దేశం తమ బలమైన జట్లను ప్రకటిస్తుండగా.. టీమిండియా జట్టును భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు(బిసిసిఐ) ఇప్పటివరకు ప్రకటించలేదు. ఒకవైపు అన్ని బోర్డులు తమ బలమైన జట్లను ఎంపిక చేసుకోవడంలో బిజీగా ఉండగా.. మరోవైపు భారత జట్టును ఎంపిక చేయడంలో బిసిసిఐ కూడా బిజీగా ఉన్నట్లు సమాచారం. సెప్టెంబర్ 9 నుంచి యుఎఇలో ప్రారంభమయ్యే ఆసియా కప్ 2025 టి20 ఫార్మాట్‌లో జరగనుంది. ఈ క్రమంలో 15 మంది సభ్యుల జట్టును ఖరారు చేయడానికి అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ ముంబయిలోని బిసిసిఐఐ ప్రధాన కార్యాలయంలో సమావేశం కానుంది. టి20 జట్టుకే ఫిక్స్ అవుతారా? లేదా? అనే దానిపై అందరి దృష్టి నెలకొంది. మరోవైపు జట్టు ప్రకటన కోసం విలేకరుల సమావేశం నిర్వహించాలా? వద్దా? అనే దానిపై బిసిసిఐ మల్లగుల్లాలు పడుతోంది. ఈ క్రమంలో జట్టు ప్రకటన కోసం విలేకరుల సమావేశం ఉండదని, జట్టు జాబితాను అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం భారత్-పాక్ వివాదం మధ్య విలేకర్ల నుంచి దాయాది మ్యాచ్ రద్దు ప్రశ్నలు వచ్చే అవకాశం ఉందని, అందుకే ముందు జాగ్రత్త చర్యగా ఇలాంటి నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

**గిల్ స్థానాన్ని భర్తీ చేయడం కష్టం..** మరోవైపు జట్టు ఎంపికపై సుదీర్ఘ చర్చలు జరుగుతున్నాయి. స్టార్ ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా ఈ టోర్నమెంట్‌కు అందుబాటులో ఉంటాడని, 31ఏళ్ల బుమ్రా ఇటీవల ఇంగ్లాండ్‌తో జరిగిన టెస్ట్ సిరీస్‌లో మూడు మ్యాచ్‌ల్లో 14 వికెట్లు పడగొట్టడంతో అతడిని తుదిజట్టులో ఎంపిక చేసే ఛాన్స్ ఉంది. మరోవైపు భారత టెస్ట్ కెప్టెన్ శుభ్‌మాన్ గిల్ జట్టులో స్థానం కష్టంగా కనిపిస్తోంది. గిల్ ప్రస్తుత టి20 వ్యూహానికి సరిపోలేదని సెలెక్టర్లు విశ్వసిస్తున్నారు. 2024 టి20 ప్రపంచ కప్ నుంచి జట్టులో భాగమైన ఆటగాళ్లను జట్టులో ఉంచాలని వారు కోరుకుంటున్నారు. ఈ క్రమంలో సూర్యకుమార్ యాదవ్, బుమ్రా, హార్దిక్, అక్షర్, అర్ష్‌దీప్ పేర్లు ఖాయమైనట్లు సమాచారం.

**పాకిస్తాన్ వైదొలిగితే:** ఆసియాకప్‌ను పాకిస్తాన్ జట్టు బారుకాట్ చేయాలనే ఉద్దేశ్యంతో ఉన్నట్లు సమాచారం. భారత్, పాకిస్తాన్ జట్లు ఒకే గ్రూప్‌లో ఉన్న క్రమంలో పాకిస్తాన్ క్రికెట్‌బోర్డు(పిసిబి) అభ్యంతరం తెలపకపోవడంపై సోషల్‌మీడియాలో ప్రధాన చర్చ జరుగుతోంది. ఆసియాకప్‌లో ఒకే గ్రూప్‌లో ఈ రెండుజట్లు టైటిల్‌పోరుతో కలిపి మూడుసార్లు తలపడాల్సి ఉంటుంది. ఈ క్రమంలో పాకిస్తాన్ క్రికెట్‌బోర్డు ఎందుకు విముఖత వ్యక్తం చేయలేదని దుమారం లేస్తోంది. టోర్నీ ఆతిథ్య హక్కులను లాగేసుకోవడం, యుఎఇలో జరిగే టోర్నీకి భారత్ ఆతిథ్యం ఇవ్వడం పాక్ అభిమానులను మరింత ఆజ్యం పోసేలా చేసింది. ఈ క్రమంలో పాకిస్తాన్ టోర్నీని బారుకాట్ చేస్తే బిసిసిఐ భారీగా నష్టపోవడం ఖాయం. అదే జరిగితే ఆ నష్టాన్ని ఎలా భర్తీ చేయాలనే ఆలోచనలో బిసిసిఐ ఉన్నట్లు సమాచారం.

## సరిగ్గా 17 ఏళ్ల క్రితం..
# ప్రపంచ క్రికెట్‌లో అద్భుతం మొదలైంది..

**-వన్డే మ్యాచ్‌తోనే కెరీర్‌ను మొదలుపెట్టిన కోహ్లి.. ఇప్పటివరకు ఈ ఫార్మాట్లో 302 మ్యాచ్‌లు ఆడాడు. 290 ఇన్నింగ్స్‌లో 14,181 పరుగులు చేశాడు.అత్యధిక స్కోరు 183. సగటు 5.788. మొత్తం 51 సెంచరీలు చేశాడు**




ప్రపంచ క్రికెట్ ఎందరో గొప్ప ఆటగాళ్లను చూసింది..వారిలో ఆల్ రౌండర్‌లు ఉన్నారు.. బ్యాట్స్‌మెన్లు ఉన్నారు.. బౌలర్లు ఉన్నారు.. కానీ, వీరంతా ఏదో ఒక ఫార్మాట్‌లోనో, రెండు ఫార్మాట్లలోనో గొప్పవారు.. ఇతడు మాత్రం మూడు ఫార్మాట?లోనూ మొనగాడు. వందకు పైగా టెస్టులు.. 300 పైగా వన్డేలు.. 125 టి20లు..! ఇది ట్రాక్ రికార్డు కాదు.. ఇండస్ట్రీ రికార్డ్..! మొత్తమ్మీద చూస్తే ప్రపంచ క్రికెట్‌లో అతడో సూపర్ మ్యాన్. ఆ అద్భుతానికి పునాది పడింది సరిగ్గా 17 ఏళ్ల కిందట ఇదే రోజు. సరిగ్గా సచిన్ టెండూల్కర్ యుగం మొదలయ్యే సమయంలో వచ్చాడు విరాట్ కోహ్లి. తన శకం మొదలుపెట్టాడు. 2008లో అండర్ 19 ప్రపంచ కప్ గెలిచిన భారత జట్టు కెప్టెన్‌గా ఆరు నెలల్లోనే జాతీయ జట్టులోకి వచ్చాడు. మహామహులు ఉన్న జట్టుకు ఎంపికయ్యాడు. ఆ ఏడాది ఆగస్టు 18న శ్రీలంకతో జరిగిన వన్డే సిరీస్‌లో తొలి మ్యాచ్ ఆడాడు. అంటే ఇప్పటికి 17 ఏళ్లు అన్నమాట. రావడం అయితే సులువుగానే వచ్చాడు కానీ.. కోహ్లి ప్రయాణం అనుకున్నంత సులువుగా ఏమీ జరగలేదు. సెహ్వాగ్, సచిన్, గంభీర్, రైనా, రోహిత్, ధోనీ, యువరాజ్ తదితరులు ఉండడంతో 2011 వరకు వన్డే తుది జట్టులో చోటు ఖాయం కాలేదు. 2011 వన్డే ప్రపంచ కప్ గెలిచిన జట్టులో సభ్యుడిగా ఉన్నప్పటికీ తన పాత్ర మరీ జూనియర్ యాంకర్. అయితే, 2012 నుంచి కోహ్లి ఎరా మొదలైంది. వన్డే మ్యాచ్‌తోనే కెరీర్‌ను మొదలుపెట్టిన కోహ్లి.. ఇప్పటివరకు ఈ ఫార్మాట్లో 302 మ్యాచ్‌లు ఆడాడు. 290 ఇన్నింగ్స్‌లో 14,181 పరుగులు చేశాడు. అత్యధిక స్కోరు 183. సగటు 5.788. మొత్తం 51 సెంచరీలు చేశాడు. ఈ ఫార్మాట్‌లో అత్యధికం ఇవే. 74 హాఫ్ సెంచరీలు బాదాడు. 2011 ప్రపంచ కప్ అందుకున్న జట్టులో సభ్యుడు. సచిన్ (18426), సంగక్కర (14234) తర్వాత కోహ్లి మూడో స్థానంలో ఉన్నాడు. -కోహ్లి 2011, 2015, 2019, 2023 వన్డే ప్రపంచ కప్‌లు ఆడాడు. 2019లో సెమీస్ చేరిన జట్టుకు అతడే కెప్టెన్. 2027 వన్డే ప్రపంచ కప్ వరకు కొనసాగితే ఐదో ప్రపంచ కప్ ఆడిన అతి తక్కువ మంది క్రికెటర్ల సరసన నిలుస్తాడు. 19 ఏళ్ల కుర్రాడిగా 2008లో అరంగేట్రం చేసిన కోహ్లి దాదాపు 40 ఏళ్ల మధ్య వయస్కుడిగా 2027 ప్రపంచ కప్ ఆడినట్లు అవుతుంది.

## హంద్రీనీవా కాలవలను

# పరిశీలించిన హాస్పిటల్ డెవలప్మెంట్ డైరెక్టర్



**తనకల్లు - సూర్య వాస్తవం, ఆగస్టు 18:** శ్రీ సత్య సాయి జిల్లా మండల పరిధిలోని కొక్కంటి క్రాస్ పెట్రోల్ బంకు దగ్గర కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ ఆదేశాల మేరకు తనకల్లు హాస్పిటల్ డెవలప్మెంట్ డైరెక్టర్ సోంపాలెం నాగభూషణ ఆధ్వర్యంలో సోమవారం హంద్రీనీవా కాలవకు గంగమ్మ తల్లికి పూజలు చేసి టెంకాయ కొట్టి పూలు చల్లి హారతి ఇచ్చారు ఈ సందర్భంగా నాగభూషణం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్ర బాబునాయుడు ఆదేశాల మేరకు నిన్నటి రోజు చెర్లోపల్లి డ్యాం నుంచి పుంగనూరు కెనాల్ కుప్పం వరకు నీరు పోవడానికి శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ ఆదివారం గేట్లు ఎత్తారు. ఆ నీరు సోమవారం కొక్కంటి క్రాస్‌కు చేరుకోవడంతో రైతులతో కలిసి అక్కడ పూజలు చేయడం జరిగింది. రైతులు రాష్ట్ర ప్రజలు కదిరి నియోజవర్గం ప్రజలు తనకల్లు మండల ప్రజలు ఆనందంలో మునిగిపోయారు గడిచిన ప్రభుత్వం ఐదు సంవత్సరాలు జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో రైతును నట్టింట ముంచారు అందుకే అందరూ కలిసికట్టి 2024 లో మహాకూటమికి అధికారమిచ్చారు చెప్పిన మాట ప్రకారము రైతులకు సబ్సిడీ త్రిప్పులురైతు సుఖీభవ హాంద్రిన్నివా నీరు ప్రతి ఒకటి చేసి చూపించిన ఘనత మహా కూటమికి ఉందని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ డెవలప్మెంట్ డైరెక్టర్ సోంపాలెం నాగభూషణం, మాజీ సర్పంచ్ గోవిందు, గ్రామ కమిటీ ఉపాధ్యక్షుడు పులికంటి నరసింహులు, వేణుగోపాల్ నాయుడు, యూనిట్ ఇంచార్జ్ పులి మహేష్, సింగల్ విండో డైరెక్టర్ లక్ష్మన్న, బొంతలపల్లి వెంకటరెడ్డి, రాధాకృష్ణ, కోరే ఆదినారాయణ, బిందులు, భాష రవీందర్ రెడ్డి, ఎస్సీ సెల్ రవి ఆంజనేయులు, ఓబులేసు, ఆదినారాయణ, ఎస్సీ ఆదినారాయణ, పూల రమేష్, హరి వెంకటేష్, రమణ, భాష తదితరులు పాల్గొన్నారు

## గత ప్రభుత్వంలో దిశా "

# కూటమి ప్రభుత్వంలో "దిశాఅదృశ్యం "



**కళ్యాణదుర్గం - సూర్య వాస్తవం, ఆగస్టు 18:** గత నాలుగు రోజుల క్రితం ఆత్మహత్య చేసుకొని మరణించిన బోయ శ్రావణి ఆత్మకు శాంతి కలగాలని సోమవారం నాడు స్థానిక టీ సర్కిల్ లో కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమం వైసీపీ కళ్యాణదుర్గం మున్సిపల్ కన్వీనర్ .. ఐ సుధీర్ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పుడు నుంచి రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని. వరకట్న హత్యలు మానభంగాలు మహిళలపై చిత్ర హింసలు పోక్సో కేసులు లైంగిక వేధింపులు ఇలా అనే కమైన నేరాలకు పాల్పడు తున్న వారిపై ఎలాంటి చట్ట పరమైన చర్యలు తీసుకోకుండా ఉండడం సభ్య సమా జానికి తలదించుకునేలా ఉందని అన్నారు. గతంలో వైఎస్ఆర్సిపి " దిశా ఉండేది "ఇప్పుడు కూటమి ప్రభుత్వం దిశ అదృశ్యం "చేశారు. ఇలాంటి దౌర్భాగ్య ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి మహిళలకు రక్షణ లేకుండా పోయింది. మునిపెన్నడు చూడని సంఘ టనలను ఈ ప్రభుత్వంలో చూస్తున్నాం... ఆత్మహత్య చేసుకున్న శ్రావణి కూతురుకు, శ్రావణి తల్లి దండ్రులకు న్యాయం జరిగేంత వరకు... శ్రావణి ఆత్మహత్యకు ప్రేరేపించిన వాళ్లను కచ్చితంగా కఠినంగా శిక్షిం చేంతవరకు వారికి తగు న్యాయం జరిగేంత వరకు వైయస్సార్సీపి కాంగ్రెస్ పార్టీ అవిశ్రాంత పోరాటం పోరాడుతామని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో.. గోళ్ళ సూరిరూరల్ కన్వీనర్ మైనారిటీ నాయకులు షేక్షావలి బిక్కి హరి మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ బిక్కి నాగలక్ష్మి చందన శివాజీ కో ఆప్షన్ నెంబర్ మమత లత లక్ష్మీకా ంతమ్మ అర్చన ఎంపీపీ మారతమ్మ గోపారం శ్రీనివాసులు నారాయణపురం వెంకటేశులు చరణ్ భీమ లింగ ఓం ప్రకాష్ పీట్ల అజయ్ వడ్డే నరేష్ అంజి మల్లీ మోహన్ అనంతపురం నుండి మహిళా నాయకురాలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# పింఛా ప్రాజెక్టు నుండి నీటి విడుదల

**- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**
**- జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి**





**అన్నమయ్య బ్యూరో -సూర్యవాస్తవం, ఆగస్టు 18:** పింఛా ప్రాజెక్టు జలాశయం నుండి నీటిని విడుదల చేస్తున్న నేపథ్యంలో పరీవాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. సోమవారం పింఛా ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండి పొంగిపొర్లుతున్న దృష్ట్యా జలహారతితో సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, టిడిపి నాయకులు లక్ష్మీ ప్రసాద్ రెడ్డి, టిడిపి పార్లమెంటు అధ్యక్షులు చమర్తి జగన్మోహన్ రాజు తదితరులతో కలిసి జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. . గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా పింఛా ప్రాజెక్టుకు భారీ ఎత్తున వరద నీరుతో పింఛా ప్రాజెక్ట్ నిండిన నేపథ్యంలో పరీవాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. పింఛా ప్రాజెక్టు కెపాసిటీ 327.60 ఎంసీఎఫ్‌టీ కు చేరుకుందన్నారు. ప్రాజెక్టు నుండి కిందకు నీటిని విడుదల చేయడంతో కుడి కాలువ ఆయకట్టు ద్వారా 2,211 ఎకరాలకు, ఎడమ కాలువ ఆయకట్టు ద్వారా 1,562 ఎకరాలకు మొత్తం 3,773 ఎకరాలకు సాగు, త్రాగునీటి అవసరాలకు నీటిని అందించడం జరుగుతోందన్నారు. ఈ ప్రాంత ప్రజలకు సాగు మరియు తాగునీటికి ఎటువంటి నీటి సమస్య ఉండదన్నారు. వర్షాల కారణంగా వరద ముప్పును తగ్గించడానికి ఫ్లడ్ గేట్లను అర అడుగు మేర ఎత్తడం జరిగిందని కుడి, ఎడమ కాలువకు సంబంధించిన చెరువులకి నీటిని విడుదల చేయడం జరిగిందని తెలిపారు. ఎడమ కాలువకు సంబంధించిన చెరువులకు నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. అదే విధంగా, ప్రాజెక్టు దిగువన ఉన్న గ్రామాల ప్రజలు మరియు పశువుల కాపరులు సురక్షిత ప్రాంతాలకు తరలిపోవాలని ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. నీటి విడుదల జరుగుతున్న నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ ఎస్‌ఈ వెంకటరామయ్య, డిఈ చెంగల్ రాయులు, తాసిల్దార్, నీటిపారుదల శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.










# నేతాజీ సుభాష్ చంద్రబోస్ 80వ వర్ధంతి

**గుత్తి - సూర్య వాస్తవం, ఆగస్టు 18:** గుత్తి పట్టణంలోని ఫుట్బాల్ మైదానంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల భవనంలో అదనపు కార్యదర్శి జెన్నే కుల్లాయిబా బు,సెక్రెటరీ రామ్ మోహన్ ఆధ్వ ర్యంలో నేతాజీ సుభాష్ చంద్రబో స్ 80వ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముందుగా నేతాజీ సుభాష్ చంద్రబోస్ చిత్ర పటానికి అదనపు కార్యదర్శి జె న్నే కుల్లాయిబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. వక్తలుమా ట్లాడుతూ మనము కూడా దేశ నాయకులు అడుగు జాడలలో నడవాలి. వీరు సివిల్స్ పరీక్షలో దేశ వ్యాప్తంగా నాల్గవ స్థానము పొంది బ్రిటిష్ రాజ్యంలో కలెక్టర్ పదవి దక్కినప్పటికి ఆ పదవికి రాజీనామా చేసి భారత జాతిస్వా తంత్ర్య ము కోసం తన జీవితా న్ని అంకితం చేసారు. వీరు జర్మనీ జపాన్ మలేషియా,ఫిలిఫైన్ మొ దలగు దేశాల తో చర్చించి 40,0 00 మంది సైన్యాన్ని తయారు చేసి రాస్ బిహారీ బోస్ తనకు అ ప్పజెప్పి ఆజాద్ హింద్ ఫౌజ్ ని మరింత పటిష్టం చేశారు. వీరి మ రణం గురించి ఇప్పటి సమగ్ర స మాచారం లేదు అని అదనపు కా ర్యదర్శి జెన్నే కుల్లాయిబాబు తెలి పారు. ఈ కార్యక్రమంలో అదనపు కార్యదర్శి జెన్నే కుల్లాయిబాబు, సెక్రెటరీ రామ్ మోహన్, ఫక్రుద్దీన్, షైక్షా వలి, నారాయణరెడ్డి, చెన్నా రెడ్డి, హస్సన్ అహమ్మద్, నారాయణ శెట్టి, శామ్యూల్, దేవదాస్ మొదలగు వారు పాల్గొన్నారు.

# పీవీకేకే ఐటీలో
# ముగిసిన ఏడు రోజుల వర్క్ షాప్



**అనంతపురం - సూర్య వాస్తవం, ఆగస్టు 18:** పి.వి.కె.కె. ఇంజనీరింగ్ కళాశాలలో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో " సెన్సార్ ఇంటిగ్రేషన్ అండ్ అప్లికేషన్స్ - బ్రిడ్జింగ్ ది ఫిజికల్ అండ్ డిజిటల్ వరల్డ్" అనే అంశంపై బీటెక్ మూడవ సంవత్సరం చదువుతున్న విద్యా ర్థులకు వారం రోజుల పాటు ఈనెల 12 నుంచి 18 దాకా ఆన్లైన్, ఆఫ్లైన్ ద్వారా వర్క్ షాప్ నిర్వహించారు. దీని ద్వారా విద్యార్థులు సెన్సార్లను హార్డ్‌వేర్ ప్లాట్‌ఫాంలతో అనుసంధానం చేయడం, డేటా ప్రాసెసింగ్ చేయడం, స్మార్ట్ అప్లికేషన్ల రూపకల్పనలో అనుభవాన్ని పొందారు. ఈ వర్క్‌షాప్‌లో విద్యార్థులకు టెంపరేచర్, హ్యూమిడిటీ, మోషన్, ప్రాక్సిమిటీ వంటి విభిన్న రకాల సెన్సార్ల పరిచయం కల్పించడమే కాకుండా, ఆర్డినో మరియు ఇఎస్‌పి 32 వంటి మైక్రోకంట్రోలర్స్‌తో వాటిని ఎలా ఇంటర్‌ఫేస్ చేయాలో ప్రాక్టికల్‌గా నేర్పించారు. అదేవిధంగా డేటా అక్విజిషన్, ప్రాసెసింగ్ అండ్ విజువలైజేషన్, ఐఓటి ఆధారిత అప్లికేషన్లు, క్లౌడ్ ఇంటిగ్రేషన్ వంటి అంశాలను కూడా విద్యార్థులు ఆచరణాత్మకంగా అనుభవించారు. సిద్ధాంతము మరియు ప్రాక్టికల్‌ను మిళితం చేస్తూ విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచన, వినూత్న ఆవిష్కరణలు మరియు సమస్య పరిష్కార నైపుణ్యాలు పెంచడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. కళాశాల చైర్మన్ డా. పల్లె కృష్ణ కిషోర్ మాట్లాడుతూ "విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభను ప్రదర్శించేందుకు ఈ తరహా వర్క్‌షాప్‌లు దోహదపడతాయని తెలిపారు. ఈ కార్య క్రమంలో యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డా. బండి రమేష్ బాబు, వైస్ ప్రిన్సిపాల్ డా.దీప్తి జోర్దాన, ఏవో డాక్టర్ మనోహర్ రెడ్డి, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డా. సుదర్శన్, అధ్యాపకులు పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు.

# భారీ వినాయక
# విగ్రహ ఏర్పాటుకు సన్నాహాలు

**- వినాయక విగ్రహాన్ని ప్రతిష్టించేందుకు భారీ సెట్టింగ్ ఏర్పాట్లు**
**- గత 25 ఏళ్లుగా అంగరంగ వైభవంగా వినాయక ఉత్సవం**
**- వినాయక ఉత్సవ కమిటీ నిర్వాహకులు పోట్లపూడి రాజేష్ స్నేహబంధం**



**నాయుడుపేట - సూర్య వాస్తవం, ఆగస్టు 18:** వినాయక చవితి పర్వదినం సందర్భంగా నాయుడుపేట పట్టణంలోని దర్గా రోడ్ లో సినిమా సెట్టింగులతో భారీ వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు నాయుడుపేట వినాయక చవితి కమిటీ సభ్యులు సన్నా హాలు ప్రారంభించారు. ఈనెల 27వ తేదీ వినాయక పండుగ సందర్భంగా ఏర్పాటు చేయనున్న భారీ వినాయక విగ్రహాన్ని హైద రాబాద్ నుండి తెప్పించనున్నారు. 27వ తేదీ ఉదయం అంగరంగ వైభవంగా ప్రత్యేక పూజలు నిర్వహించి వినాయక విగ్రహాన్ని ప్రతిష్టించనున్నారు. వినాయక విగ్రహాన్ని ప్రతిష్టించేందుకు భారీ సెట్టింగ్ ఏర్పాటు చేస్తున్నారు. వినాయక ఉత్సవ కమిటీ నిర్వాహకులు పోట్లపూడి రాజేష్, భారతాల సాయిరామ్ కిషోర్, గోనుపల్లి గురుమూర్తి,బల్లి కుమార్,ఆవుల సుధాకర్, బయ్యా రామారావు బయ్యా రమేష్, దేవత గోపి,శంకర్ లాల్,సొల్లేటి రమేష్ చింతంరెడ్డి మురళి,డిటిడిసి సురేష్, వెంకయ్య, రామకృష్ణ, స్టాలిన్, నజీర్, దయాకర్,సత్య, రాఘవ,మధు,మౌనిష్,సొల్లేటి మోహన్ ఆధ్వర్యంలో గత 25 ఏళ్లుగా వినాయక ఉత్సవం అంగరంగ వైభవంగా నాయుడుపేట పట్టణంలో నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో వినాయక చవితి పండుగ సందర్భంగా భారీ వినాయక విగ్రహ ప్రతిష్ట ఏర్పాట్లకు బెంగాల్ నుండి వచ్చిన కళాకారులు సినిమా సెట్టింగ్ తరహాలో పనులు ప్రారంభించారు. నాయుడుపేట వినాయక చవితి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గత పాతికేళ్లుగా జరుగుతున్న ఉత్సవాల్లో నాయుడుపేట పట్టణంతోపాటు చుట్టుపక్క మండలాల నుండి వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకోవడం జరుగుతుంది. అనంతరం సెప్టెంబర్ 4వ తేదీన వివిధ సాంస్కృతిక కార్యక్రమాల నడుమ నిమజ్జనం చేసేందుకు వినాయక విగ్రహాన్ని తూపిలిపాలెం సముద్రానికి తరలించనున్నారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )